

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 23-02-2026 | సంపుటి - 26 | సంచిక -275 | రూ : 4 | పేజీలు: 8




లొంగిపోయిన మావోయిస్టు పార్టీ

## కార్యదర్శి దేవ్‌జీ!

- మరో అగ్రనేత మల్లా రాజిరెడ్డితో పాటు 20 మంది మావోయిస్టులు కూడా..
- తెలంగాణ పోలీసుల ముందు సరెండర్
- నేడో, రేపో ప్రకటించనున్న డీజీపీ

హైదరాబాద్ : సీపీఐ(మావోయిస్టు) పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీతో పాటు మరో కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డిలు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయారు. వీరితో పాటు మరో 20 మంది మావోయిస్టులు కూడా సరెండరయ్యారు. రాష్ట్రానికి చెందిన దాదాపు 17 మంది మావోయిస్టులు మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారనీ, వారు కూడా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని డీజీపీ ఇటీవల చేసిన ప్రకటన ప్రభావమో, మరోవైపు ఎస్ఐబీకి చెందిన స్పెషల్ ఆపరేషన్ టీం రాష్ట్ర సరిహద్దుల్లో విశ్వసనీయమైన సమాచారం మేరకు జరిపిన ప్రత్యేక ఆపరేషన్ కారణంగా దేవ్‌జీ, రాజిరెడ్డి బృందం లొంగుబాటులో నడిచినట్టు తెలుస్తోంది.

తరువాయి 2లో

గోదావరి జలాలపై

# చర్చకు సిద్ధం...

- దేవాదుల భూసేకరణకు రూ.600 కోట్లు
- మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను గాలికొదలం
- రాష్ట్రంపై రూ.8.11 లక్షల కోట్ల అప్పుల భారం
- చాలా గొప్పగా మేడారం నిర్వహణ : సీఎం రేవంత్‌రెడ్డి

2లో





## ఏమిటీ 'నగ్న' రాజకీయం!

- ఇప్పటికే నిస్సిగ్గుగా ఉన్నారు.. ఇంకా చొక్కాలు విప్పడమెందుకో?
- ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ కార్యకర్తల తీరుపై మీరట్ సభలో మోదీ ధ్వజం

మీరట్, ఫిబ్రవరి 22: దేశ రాజధానిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఇండియా కృత్రిమ మేధ (ఏఐ) ఇంపాక్ట్ సదస్సు విజయవంతం కావడం కాంగ్రెస్

తరువాయి 2లో




# ఎవరికి వారే..

- ఆశలు, ఆందోళనలు, వివాదాలు
- ఏఐ సదస్సులో పనిచేయని ఇంటర్నెట్
- చేతులు కలపని సీఈఓలు
- చైనా రోబో వివాదంతో అంతర్జాతీయంగా విమర్శలు
- పలు ఆవిష్కరణలకు కుదిరిన ఒప్పందాలు

2లో

## నకిలీ.. యూనివర్సిటీలు

- బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అధికం...
- దేశరాజధానిలోనే 12 ఫేక్ యూనివర్సిటీలు
- ఆ తర్వాతి స్థానం యూపీదే...
- మోసపోతున్న విద్యార్థులు
- యూజీసీ హెచ్చరిస్తున్నా చర్యలు శూన్యం

2లో






అత్యధిక బొగ్గు ఉత్పత్తి గనిగా

## గెవ్రా!

2లో


- 2026..27లో 63 మి.టన్నుల లక్ష్యం
- ఎస్ఈసీఎల్ సీఎండీ హరీశ్ దుహన్

తపాలాశాఖ సేవలను

## మరువలేం

- జీడీఎస్‌ల ద్వారా రాష్ట్రప్రభుత్వ పౌరసేవలు
- ఏపీలో ఎలక్ట్రిక్ సైకిల్ మోడల్‌కు శ్రీకారం చుట్టండి
- గుంటూరులో గ్రామీణ డాక్‌సేవక్ సమ్మేళనంలో సీఎం చంద్రబాబు

2లో





ఏఐ కొలువులు

## పిలుస్తున్నాయ్..

- ఉద్యోగ కల్పనలో నాలుగో స్థానంలో హైదరాబాద్

హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) మనందరి జీవితాల్లో భాగమైపోయింది. ఇప్పుడు ఉద్యోగులు, వ్యాపారవర్గాల్లో ఎక్కడ చూసినా దీని గురించే చర్చ. దేశంలో ఈ రంగం వేగంగా దూసుకెళుతోంది. ఏఐ తీసుకొస్తున్న మార్పులతో క్రమంగా కొలువులు మారుతున్నాయి. దేశం మొత్తంలో ఏఐ ఆధారిత ఉద్యోగాల్లో సగానికి పైగా కేవలం బెంగళూరు, ఢిల్లీ నగరాల్లోనే ఉండగా.. హైదరాబాద్ నాలుగో స్థానంలో ఉంది.


తరువాయి 2లో

ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ

# హైస్పీడ్ ఇంటర్నెట్

- అమెండెడ్ భారత్‌నెట్ ప్రాజెక్టు కింద రూ.2,432 కోట్ల ఖర్చు
- కేంద్ర ప్రభుత్వంతో ఎంఓసీపై సంతకాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- పాల్గొన్న కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని చంద్రశేఖర్

2లో



# గోదావరి జలాలపై చర్చకు సిద్ధం

ములుగు : దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణకు రూ.600 కోట్లను కేటాయించనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్దనున్న దేవాదుల ప్రాజెక్టు ఇన్‌టేక్‌వెల్‌ను సీఎం సందర్శించారు. అనంతరం ప్రాజెక్టు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసేకరణ జాప్యంతో ప్రాజెక్టులు ఆపడానికి వీలులేదన్నారు. అన్ని ప్రాజెక్టుల భూసేకరణకు ప్రత్యేక కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి అన్ని అంచనాలను ప్రభుత్వం ముందుకు బడ్జెట్ సమావేశాలకు ముందే తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. మార్చిలో మంత్రివర్గ సమావేశంలో అన్ని అంచనాలకు ఆమోదం తెలుపనున్నట్టు స్పష్టం చేశారు. నెలలోపు దేవాదుల పంపుల మరమ్మతులను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. రామప్ప చెరువు నుంచి జంపన్నవాగుకు నీరందించే ప్రణాళికపై వెంటనే నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండేండ్లలో అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయడానికే ఇక్కడికి వచ్చినట్టు చెప్పారు.

**గోదావరి జలాలపై ముఖాముఖి చర్చ**

బడ్జెట్ సమావేశాల అనంతరం గోదావరి జలాలపై ముఖాముఖి చర్చ పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు సీఎం తెలిపారు. ఈ వివాదాలపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని, మా తప్పులు ఏంటో, మీ తప్పులు ఏంటో చర్చిద్దామని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి అన్నారు. మీది పదేండ్ల అనుభవమని, మాది రెండేండ్ల అనుభవమని, ఎవరేం చేశారో పూర్తిస్థాయి చర్చ చేద్దామని చెప్పారు. ఆరోపణలు చేస్తే అతికేట్టు ఉండాలని, చవకబారు ఆరోపణలు, విమర్శలు చేయొద్దని కేసీఆర్, హరీశ్‌రావుకు సీఎం సూచించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన సూచనలను రాసుకున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతల ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. ఇప్పటికీ మాకు ఓటు వేయకపోవడం ప్రజలదే తప్పు అనే భావనలో ఉండటం సరైంది కాదని హితవు పలికారు. మీ తప్పులను సమీక్షించుకోండని సలహానిచ్చారు. సహేతుకమైన విమర్శలు చేయాలన్నారు. ప్రజలు విజ్ఞులు, ప్రజలను తప్పుపట్టడం మానండని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. పిల్లి శాపనార్థాలు పెడితే ఉట్టిపడదన్నారు. కృష్ణా జలాలపై ఎన్నో అపోహలుండేవని, ఈ నేపథ్యంలోనే అసెంబ్లీలో పూర్తిస్థాయి చర్చ పెట్టడం జరిగిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు.. నీటిపారుదల శాఖ మంత్రులుగా ఉన్నప్పుడు ఏం జరిగింది.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రిగా ఉన్న ఈ రెండేండ్లలో ఏం జరిగిందనేది స్పష్టంగా చర్చ జరిగిందని చెప్పారు. వాళ్ల ప్రశ్నలకు సమాధానం కూడా చెప్పామన్నారు. మీరు తప్పు చేశారనే ప్రజలు గుర్తించి శిక్షించారని తెలిపారు. గోదావరి జలాలపై అబద్ధాలను ప్రచారం చేయడం మానుకోవాలని కోరారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేసి ఇతర ప్రాజెక్టులను పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు నీళ్లు, నిధులుండేవని, ఆ పదేండ్లలో ప్రాజెక్టులను పూర్తి చేస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని తెలిపారు. రాష్ట్రంలో రూ.8.11 లక్షల కోట్ల అప్పుల భారముందన్నారు. 2001లో దేవాదుల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.6 వేల కోట్లు అని, అనంతరం అంచనాలు రూ.13,400 కోట్లకు, రూ.14,500 కోట్లకు పెరిగాయని, తాజాగా రూ.18,500 కోట్లకు అంచనాలు ఎగబాకాయని చెప్పారు. ఇకనైనా ఈ అంచనాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలన్నారు. ఈ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. గోదావరిపైనున్న తుమ్మిడిహట్టి నుంచి భద్రాచలం వరకు ఎన్ని ప్రాజెక్టులుంటే అన్ని ప్రాజెక్టుల పనులనూ సమీక్షించి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఒక్క నీటిబొట్టును లిఫ్టు చేయకపోయినా దేశంలో గత రెండేండ్లలో వరిని అత్యధికంగా పండించడంలో, ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రమే నెంబర్ వన్‌గా ఉండేది కాదన్నారు.

- **మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను గాలికొదిలేయం..**

వేల కోట్ల రూపాయలతో నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను గాలికొదిలేయబోమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బ్యారేజీ నిర్మాణాల్లో ఉన్న లోపాలను సరిదిద్ది భవిష్యత్తులో ప్రమాదాలు లేకుండా చేయడానికే సమయం పడుతుందన్నారు.

# ఎవరికి వారే..

న్యూఢిల్లీ : భారత్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026 ఆశలు, ఆందోళనలు, వివాదాల మధ్య ముగిసింది. కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో భారత్ తన నాయకత్వాన్ని చాటుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ సమ్మిట్, నిర్వహణ లోపాలు, ప్రముఖుల గైర్హాజరు, ఏఐ వల్ల తలెత్తే సామాజిక సవాళ్లపై లోతైన చర్చల కొరత వంటి అంశాలతో తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. ముఖ్యంగా, ప్రజలను తప్పుదోవ పట్టించే డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారం వంటి అంశాలపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ అంశాలే సమ్మిట్ చర్చలకు ప్రధానాంశంగా మారాయి. అయితే ఈ సదస్సుకు బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డిసెల్వా, శ్రీలంక అధ్యక్షుడు విక్రమ నాయకే, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, తదితర దేశ నాయకులు ప్రముఖ కంపెనీల సీఈఓలు పాల్గొన్నారు. ఢిల్లీ డిక్లరేషన్‌పై 88 దేశాలు సంతకాలు చేశాయని, 250 బిలియన్ల డాలర్ల పెట్టుబడులకు హామీలు వచ్చాయని, ఈ శిఖరాగ్ర సదస్సులో దాదాపు 5 లక్షల మంది పాల్గొన్నారని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

- **చుట్టుముట్టిన వివాదాలు, నిర్వహణా లోపాలు**

సమ్మిట్ ప్రారంభం నుంచే పలు వివాదాలు, నిర్వహణా లోపాలు దీని ప్రతిష్టను దెబ్బతీశాయి. భారత్ మండపంలో జరిగిన ఈ సమ్మిట్‌లో మొదటిరోజు నుంచే భారీ క్యూలు, గందరగోళం నెలకొంది. అనేక గేట్లు మూసివేయడం, సరైన సమాచారం లేకపోవడంతో ప్రతినిధులు గంటల తరబడి బయటే ఉండిపోయారు. బెంగళూరుకు చెందిన పారిశ్రామికవేత్త ధనుంజరు యాదవ్ తన వేర్‌బుల్ వస్తువులను దొంగలించారని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అనంతరం పోలీసులు దొంగను పట్టుకుని, వస్తువులు అయనకు అందజేశారు. ఎగ్జిబిటర్ల తరలింపు మరో వివాదానికి దారితీసింది. ప్రధాని మోడీ పర్యటనకు ముందు ఎగ్జిబిటర్లను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఖాళీ చేయించారు. వారికి కనీసం నీరు, ఆహారం ఎక్కడ దొరుకుతాయో చెప్పే సైన్ బోర్డులు కూడా లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. టెక్ సమ్మిట్ అయినప్పటికీ, ఇంటర్నెట్ కనెక్టివిటీ సరిగా లేకపోవడంతో డిజిటల్ చెల్లింపులు వైఫల్యం చెందాయి. దీంతో స్టాల్స్ వద్ద నగదు మాత్రమే తీసుకున్నారు.

# నకిలీ యూనివర్సిటీలు

హైదరాబాద్ : దేశంలో నకిలీ యూనివర్సిటీల సంఖ్య పెరిగిపోతోంది. వాటిని కట్టడి చేయండని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్ని లేఖలు రాసినా ప్రయోజనం శూన్యం. 2025 అక్టోబర్ నాటికి దేశంలో 22 నకిలీ యూనివర్సిటీలు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 32కి పెరిగింది. ఈ యూనివర్సిటీలతో మోసపోతున్న విద్యార్థులు భారీ సంఖ్యలో ఉన్నారు. నకిలీ యూనివర్సిటీలు అత్యధికంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఉండటం గమనార్హం. దేశరాజధాని ఢిల్లీలోనే 12 ఫేక్ యూనివర్సిటీలు ఉన్నాయని యూజీసీ మొత్తుకుంటున్నా చర్యలు శూన్యం. ఇక్కడ కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలే అధికారంలో ఉండటం గమనార్హం. ఇక రెండో స్థానంలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఉంది. ఇక్కడ నాలుగు నకిలీ యూనివర్సిటీలు రాజ్యమేలుతున్నాయి. వాటిపై చర్యలు తీసుకొనేందుకు అక్కడి బుల్డోజర్ యోగీ సర్కార్‌కు చేతులు రావట్లేదు. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్, రాజస్థాన్, ఝార్ఖండ్, హర్యానా, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ ఫేక్ యూనివర్సిటీలు ఉన్నాయి. విద్యార్థులు ఈ నకిలీ యూనివర్సిటీల మాయలో పడితే భవిష్యత్ ప్రమాదంలో పడినట్లే. డబ్బుతోపాటు విద్యార్థి జీవితాన్ని, భవిష్యత్‌ను కూడా నష్టపోతారు. ప్రస్తుతం అడ్మిషన్ల సీజన్ నడుస్తుండటంతో యూజీసీ విద్యార్థుల్ని అప్రమత్తం చేస్తూ, చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ లేఖలు రాసింది. 2023 నుంచి నకిలీ యూని వర్సిటీల కట్టడిపై సాక్ష్యాధారాలతో సహా యూజీసీ లేఖలు రాస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుంది. నకిలీ విశ్వవిద్యాలయాలు జారీ చేసే డిగ్రీలకు ఏమాత్రం చట్టబద్ధత ఉండదు. ఉద్యోగావకాశాలు, ప్రభుత్వ సర్వీసులు, హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలకు ఇవి చెల్లుబాటు కావు. నకిలీ యూనివర్సిటీలు ప్రధానంగా గ్రామీణ విద్యార్థుల్ని లక్ష్యంగా చేసుకొని, ఎక్కడికక్కడ ఏజెంట్ల వ్యవస్థ ద్వారా అడ్మిషన్లు తీసుకుంటున్నట్టు తెలుస్తుంది. ఇలాంటి యూనివర్సిటీల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి.

**ఇవీ ఫేక్ యూనివర్సిటీలు**

(1) ఆంధ్రప్రదేశ్ క్రైస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ (2) ఆంధ్రప్రదేశ్ బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా (3) అరుణాచల్ ప్రదేశ్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్ (4) ఢిల్లీ వరల్డ్ పీస్ ఆఫ్ యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ (5) ఢిల్లీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ ఇంజనీరింగ్ (6) ఢిల్లీ ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అండ్ ఫిజికల్ హెల్త్ సైన్సెస్ (7) ఢిల్లీ కమర్షియల్ యూనివర్సిటీ లిమిటెడ్ (8) ఢిల్లీ యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ (9) ఢిల్లీ వొకేషనల్ యూనివర్సిటీ (10) ఢిల్లీ ఏడీఆర్ సెంట్రిక్ జురిడికల్ యూనివర్సిటీ (11) ఢిల్లీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (12) ఢిల్లీ విశ్వకర్మ ఓపెన్ యూనివర్సిటీ ఫర్ సెల్ఫ్‌ఎంప్లారుమెంట్ (13) ఢిల్లీ ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయ (ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయం) (14) హర్యానా మ్యాజిక్ అండ్ ఆర్ట్ యూనివర్సిటీ (15) జార్ఖండ్ దక్ష విశ్వవిద్యాలయం (వృత్తి, జీవన నైపుణ్య విద్య) (16) కర్నాటక సర్వ భారతీయ శిక్షా పీఠ్ (17) కర్నాటక గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (18) కేరళ ఇంటర్నేషనల్ ఇస్లామిక్ యూనివర్సిటీ ఆఫ్ ప్రొఫెటిక్ మెడిసిన్ (19) కేరళ సెయింట్ జాన్స్ విశ్వవిద్యాలయం (20) మహారాష్ట్ర రాజా అరబిక్ విశ్వవిద్యాలయం (21) మహారాష్ట్ర జాతీయ వెనుకబడిన కృషి విద్యాపీఠ్ (22) న్యూఢిల్లీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్ (23) న్యూ ఢిల్లీ మౌంటైన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ (24) పుదుచ్చేరి ఉషా లచ్చుమనన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (25) పుదుచ్చేరి శ్రీ బోధి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (26) రాజస్థాన్ రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (27) ఉత్తరప్రదేశ్ గాంధీ హిందీ విద్యాపీఠం (28) ఉత్తర ప్రదేశ్ నేతాజీ సుభాష్ చంద్ర బోస్ విశ్వవిద్యాలయం (ఓపెన్ యూనివర్సిటీ) (29) ఉత్తర ప్రదేశ్ భారతీయ శిక్షా పరిషత్ (30) ఉత్తరప్రదేశ్ మహామాయ టెక్నికల్ యూనివర్సిటీ (31) పశ్చిమ బెంగాల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్ (32) పశ్చిమ బెంగాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్ అండ్ రీసెర్చ్.

# లొంగిపోయిన మావోయిస్టు పార్టీ కార్యదర్శి దేవ్‌జీ!

హైదరాబాద్ : సీపీఐ(మావోయిస్టు) పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీతో పాటు మరో కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డిలు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయారు. వీరితో పాటు మరో 20 మంది మావోయిస్టులు కూడా సరెండరయ్యారు. రాష్ట్రానికి చెందిన దాదాపు 17 మంది మావోయిస్టులు మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారనీ, వారు కూడా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని డీజీపీ ఇటీవల చేసిన ప్రకటన ప్రభావమో, మరోవైపు ఎస్ఐబీకి చెందిన స్పెషల్ ఆపరేషన్ టీం రాష్ట్ర సరిహద్దుల్లో విశ్వసనీయమైన సమాచారం మేరకు జరిపిన ప్రత్యేక ఆపరేషన్ కారణంగా దేవ్‌జీ, రాజిరెడ్డి బృందం లొంగుబాటులో నడిచినట్టు తెలుస్తోంది.

- **నంబాల మరణం తర్వాత దేవ్‌జీకి పగ్గాలు**

కేంద్ర ప్రభుత్వం గత కొన్ని నెలలుగా మావోయిస్టు విముక్త భారత్ నినాదంతో ఆపరేషన్ కగార్‌ను చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్ ద్వారా తొమ్మిది మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలతో పాటు కీలకమైన దండకారణ్యంలో వేలాది మంది సాయుధ బలగాలతో చేపట్టిన ఆపరేషన్ కారణంగా వందల మంది మావోయిస్టులు మరణించడం, దాదాపు అదే సంఖ్యలో లొంగిపోవడం, అరెస్ట్ కావడం జరిగింది. ముఖ్యంగా కొన్ని నెలల క్రితం కర్రెగుట్టల్లో జరిగిన భారీ ఆపరేషన్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు కీలకమైన నాయకశ్రేణిలోని మావోయిస్టులు మరణించారు. కేశవరావు మరణం తర్వాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల సమీపంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన తిప్పిరి తిరుపతి మావోయిస్టు పార్టీ పగ్గాలను చేపట్టినట్టు ప్రకటించారు.

# తపాలాశాఖ సేవలను మరువలేం

అమరావతి: 'తపాలాశాఖ సేవలను ఎప్పటికీ మరువలేం. 150 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ వ్యవస్థ దేశానికి స్వాతంత్ర్యం రాక ముందునుంచీ పనిచేస్తోంది. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ సమరయోధుల మధ్య లేఖలు, పత్రికలు, మనియార్డర్లు చేరవేయడంలో తిరుగులేని పాత్ర పోషించింది. ఇప్పుడూ సరైన లక్ష్యాలు, మార్గనిర్దేశనం చేస్తే గ్రామీణ డాక్ సేవక్‌లు అద్భుతాలు చేయగలరు. ఆ దిశగా పనిచేస్తూ దేశంలో పటిష్ఠమైన లాజిస్టిక్ వ్యవస్థగా తీర్చిదిద్దుతాం. రాష్ట్రప్రభుత్వ పౌరసేవలన్నీ జీడీఎస్ (గ్రామీణ డాక్ సేవక్)ల ద్వారా అందించేందుకు అనువైన అంశాలపై సమగ్ర అధ్యయనం చేస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆదివారం గుంటూరు శివారులోని సత్యసాయి ఆధ్యాత్మిక నగరిలో జరిగిన గ్రామీణ డాక్‌సేవక్ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపాలాశాఖతో తన అనుబంధాన్ని, దేశచరిత్రలో గ్రామీణ డాక్‌సేవక్‌ల భాగస్వామ్యాన్ని వివరించారు. 'మిమ్మల్ని చూస్తే నాకు పాతరోజులు గుర్తుకొస్తున్నాయి. నేను చదువుకునే రోజుల్లో మేమంతా పోస్టుమ్యాన్‌పైనే ఆధారపడేవాళ్లం. ఉత్తరాలు పంపాలన్నా, ఫిర్యాదులు చేయాలన్నా పోస్టాఫీసుకు వెళ్లేవాళ్లం. ఏ వార్త అందాలన్నా, పార్సిల్ తేవాలన్నా పోస్టే ఆధారం. అలాంటి గ్రామీణ డాక్‌సేవక్‌ల సేవలు దేశచరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. స్టాన్‌ఫర్డ్, హార్వర్డ్ వర్సిటీల్లో చదివిన జ్యోతిరాదిత్య సింధియా కేంద్రమంత్రిగా ఉండడం గొప్ప విషయం. ఆయన కుటుంబంతో నాకు, తెదేపా వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు విడదీయరాని అనుబంధం ఉంది' అని పేర్కొన్నారు.

**33 శాతం డీబీటీ మీ ద్వారానే..**

'దేశంలో 1.64 లక్షల పోస్టాఫీసుల్లో 3 లక్షల మంది గ్రామీణ డాక్‌సేవక్‌లు ఉన్నారు. మన రాష్ట్రంలో 9,100 పోస్టాఫీసుల్లో 17వేలకు పైగా జీడీఎస్‌లు ఉన్నారు. నేను పెట్టిన సూపర్6 సూపర్‌హిట్ అవడానికి ప్రధాన కారణం మీరు. 33% డీబీటీ మీ ద్వారానే జరిగింది. బ్యాంకింగ్, బీమా సేవలు, డీబీటీ అనుసంధాన సేవలు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు, పౌరసేవలు, ఈకామర్స్ లాజిస్టిక్ సేవలు.. ఇలా అనేకం మీద్వారా అందుతున్నాయి. జ్యోతిరాదిత్య సింధియా మీకో డ్రెస్‌కోడ్ డిజైన్ చేసి మీ గౌరవాన్ని పెంచడానికి ప్రయత్నిస్తున్నారు. డబ్బులే కాదు. గౌరవం కూడా ఉండాలి. జీడీఎస్‌లు జాతి కోసం, ప్రధాని మోదీ వికసిత భారత్ 2047 కోసం పనిచేస్తున్నారు. 11 ఏళ్లలో నాలుగో ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన మనం.. అందరం కలిసి పనిచేస్తే 2047కు తప్పకుండా మొదటిస్థానాన్ని అందుకుంటాం. యంత్రాలు, ఏఐ ఏది వచ్చినా మానవస్పర్శకు ప్రత్యామ్నాయం కాదు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ఏ పార్సిల్ వెళ్లాలన్నా మీరుండాల్సిందే.

# ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్

అమరావతి: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ రాబోయే ఏడాదిన్నరలో హైస్పీడ్ ఇంటర్నెట్ అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. టెలికాం, టెక్నాలజీ రంగంలో ఎలాంటి పైలట్ ప్రాజెక్టు చేపట్టినా.. ఏపీని టెస్ట్‌బెడ్ కింద పరిగణించాలని కేంద్రాన్ని కోరారు. అమెండెడ్ భారత్‌నెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార ఒప్పందం (మెమొరాండమ్ ఆఫ్ కోఆపరేషన్) కుదిరింది. దీనిద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని సుమారు 5 లక్షల ఇళ్లకు అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్టు (ఏబీఎన్‌పీ) కింద ఫైబర్‌నెట్ కనెక్షన్లు అందిస్తారు. రాష్ట్రంలో ఈ పథకం అమలుకు కేంద్రం రూ.2,432 కోట్లు ఖర్చు చేయనుంది. పథకం అమలుకు భారత్ నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఏపీబీఐఎల్) పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌పీవీ ఏర్పాటుచేసింది. ఒప్పందంపై డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్ర, రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సంతకాలు చేశారు. సమావేశంలో కేంద్ర కమ్యూనికేషన్లశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఏమిటీ 'నగ్న' రాజకీయం!

మీరట్, ఫిబ్రవరి 22: దేశ రాజధానిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఇండియా కృత్రిమ మేధ (ఏఐ) ఇంపాక్ట్ సదస్సు విజయవంతం కావడం కాంగ్రెస్ సహించలేకపోతోందని ప్రధాని మోదీ అన్నారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు ఆ సదస్సు వద్ద చొక్కాలు విప్పి హల్‌చల్ చేయడంపై మండిపడ్డారు. కాంగ్రెస్ మురికి, నగ్న రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికే ఆ పార్టీ నిస్సిగ్గుగా మారిందని.. ఇంకా చొక్కాలు విప్పాల్సిన అవసరం ఏముందని ఎద్దేవాచేశారు. ఆదివారం ఆయన యూపీలోని మీరట్‌లో నమో భారత్ రైలును, విస్తరించిన మెట్రో రైలును, రూ.12,930 కోట్లతో పూర్తిచేసిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. 'ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ నిరసన.. ఆ పురాతన పార్టీ సైద్ధాంతిక దివాలాకోరుతనానికి, పతనానికి నిదర్శనం. సొంత దేశాన్నే అప్రతిష్ఠ పాల్జేస్తోంది. కాంగ్రెస్ నేతలు నన్ను ద్వేషిస్తున్నారు. నాకు సమాధి తవ్వాలనుకుంటున్నారు. చివరకు నా తల్లిని అవమానించేందుకూ వెనుకాడడం లేదు. కానీ, ఏఐ సదస్సు బీజేపీ కార్యక్రమం కాదని వారు గుర్తుంచుకోవలసింది. ఇది జాతీయ కార్యక్రమం. కాంగ్రెస్ సభ్యత మరచి వ్యవహరించింది. అన్ని హద్దులూ దాటేసింది. వారి ప్రవర్తనను దేశం మొత్తం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఘటనకు సిగ్గుపడాల్సింది పోయి.. దేశాన్ని అవమానించినవారిని హీరోలుగా చిత్రిస్తోంది' అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ కార్యకర్తల తీరును ఖండించిన ప్రతిపక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. అవి జాతీయాభిమానం, సత్యం వైపు నిలిచాయని కొనియాడారు. ఒక్క కాంగ్రెస్ నేతలు మాత్రమే ఇలాంటి నిరసనకు దిగారని.. దాని మిత్రపక్షాలైన టీఎంసీ, డీఎంకే, బీఎస్పీ, నేషనల్ కాన్ఫరెన్స్ వంటి పార్టీలకు ప్రమేయం లేదని చెప్పారు.

# ఏఐ కొలువులు పిలుస్తున్నాయ్..

హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) మనందరి జీవితాల్లో భాగమైపోయింది. ఇప్పుడు ఉద్యోగులు, వ్యాపారవర్గాల్లో ఎక్కడ చూసినా దీని గురించే చర్చ. దేశంలో ఈ రంగం వేగంగా దూసుకెళుతోంది. ఏఐ తీసుకొస్తున్న మార్పులతో క్రమంగా కొలువులు మారుతున్నాయి. దేశం మొత్తంలో ఏఐ ఆధారిత ఉద్యోగాల్లో సగానికి పైగా కేవలం బెంగళూరు, దిల్లీ నగరాల్లోనే ఉండగా.. హైదరాబాద్ నాలుగో స్థానంలో ఉంది. కృత్రిమ మేధ ఆధారిత ఉద్యోగాల కల్పనలో దక్షిణాది ఐటీ హబ్ బెంగళూరు అగ్రస్థానంలో, దిల్లీ ఎన్‌సీఆర్ స్వల్ప తేడాతో రెండో స్థానంలో, ముంబయి మూడో స్థానంలో ఉన్నాయి. ఈ మూడు నగరాలు కలిపి దాదాపు 70 శాతం వాటా కలిగి ఉన్నట్లు సీబీఆర్ఐ తన నివేదికలో పేర్కొంది. నౌకరీ డాట్‌కామ్‌లో 64,500 క్రియాశీల ఉద్యోగ ప్రకటనలను విశ్లేషించిన తర్వాత ఈ గణాంకాలను వెల్లడించింది. అత్యధికంగా ఉన్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) కారణంగా బెంగళూరు.. ఏఐలో దూసుకుపోతోంది. దిల్లీ ఎన్‌సీఆర్‌లో ఫిన్‌టెక్, హెల్త్‌కేర్, ప్రభుత్వ రంగ ప్రాజెక్టులతో ఉద్యోగాలు పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లోనూ 350కిపైగా జీసీసీలు ఉన్నాయి. వీటిలో ఏఐ ఆధారిత పరిశోధనల కోసం పెద్దఎత్తున నియామకాలు జరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో మార్కెటింగ్, కమ్యూనికేషన్, కన్సల్టింగ్ రంగాల్లో ఏఐ వినియోగం మరింత పెరగనుంది. ప్రధానంగా ఇంజినీరింగ్ (సాఫ్ట్‌వేర్ అండ్ క్వాలిటీ అష్యూరెన్స్), డేటా సైన్స్ అండ్ అనలిటిక్స్ (మోడల్స్‌కు శిక్షణ ఇవ్వడం, డేటా విశ్లేషణ చేయడం), కస్టమర్ సక్సెస్ అండ్ ఆపరేషన్స్ (ఏఐ ద్వారా వ్యాపార సామర్థ్యాన్ని పెంచడం, వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడం కోసం) వంటి ఉద్యోగాల్లో ఏఐకి డిమాండ్ ఎక్కువగా ఉంది.

# అత్యధిక బొగ్గు ఉత్పత్తి గనిగా గెవ్రా!

కోర్బా: ఛత్తీస్‌గఢ్‌లో కోల్ ఇండియాకు చెందిన గెవ్రా గని, వచ్చే ఏడాది 63 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించడం ద్వారా, ప్రపంచంలోనే అత్యధిక బొగ్గు ఉత్పత్తి చేసే గనిగా అవతరిస్తుందని సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్) సీఎండీ హరీశ్ దుహాన్ వెల్లడించారు. కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన ఎస్ఈసీఎల్ నిర్వహిస్తున్న గెవ్రా గని, మన దేశంలో అతి పెద్ద ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని. 1981 నుంచి ఈ గనిలో తవ్వకాలు సాగుతున్నాయి. ఈ ఏడాది 56 మి.టన్నుల బొగ్గు ఇక్కడ వెలికి తీయనున్నారు. ఈ గని సామర్థ్యాన్ని సంవత్సరానికి 70 మి.టన్నులకు విస్తరించడానికి ఇప్పటికే పర్యావరణ అనుమతి లభించింది కూడా. వచ్చే ఏడాదిలో గెవ్రా గని 63 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, ప్రపంచంలోనే నంబర్ వన్ గనిగా మారుతుందని హరీశ్ ధీమా వ్యక్తం చేశారు. అమెరికా (వయామింగ్)లోని పౌడర్ రివర్ బేసిన్‌లో ఉన్న బ్లాక్ థండర్ గని 61 62 మి.టన్నుల ఉత్పత్తితో ప్రపంచంలోనే అతి పెద్ద బొగ్గు గనిగా ఉంది.

## చింతగూడ గ్రామం లో కోతుల పట్టివేత



ప్రజాస్ఫూర్తి జన్నారం: జన్నారం మండలంలోని చింతగూడ గ్రామంలో గ్రామ సర్పంచ్ సుతారి సుమలత వినయ్ గ్రామ ప్రజల సహకారం తో కోతులను పట్టేవారిని నెల్లూరు నుండి పిలిపించి ఆదివారం రోజున గ్రామంలోని కోతులను పట్టి అడవిలో నీరు ఉన్న ప్రదేశంలో విడిచి పెట్టడం జరిగిందని సర్పంచ్ సుతారి సుమలత వినయ్ తెలిపారు. కోతులను పట్టేవారిని నెల్లూరు నుండి పిలిపించి కోతుల బాధ తీర్చిన సర్పంచ్ సుతారి సుమలత వినయ్ ను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుత్తారి వినయ్ కుమార్, అయితే శ్రీనివాస్, ములుమూరి నాగేష్, గజ్జల మల్లేష్, లాకావత్ నందు నాయక్, దాసరి చంద్రయ్య, వీరమల్ల భీమన్న, నిరటి రాజేందర్, కునారాపు శేఖర్ పాల్గొన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో అప్పుల బాధ తట్టుకోలేక అనమేని ఆంజనేయులు (42) అనే రైతు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంజనేయులు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆయనకు భార్య రజిత (35), కుమారుడు చరణ్ (11), కుమార్తె సహస్ర (6) ఉన్నారు. కుమార్తె సహస్ర పుట్టుకతోనే మానసిక వికలాంగురాలు కావడంతో, ఆమె వైద్యం కోసం ఆంజనేయులు భారీగా అప్పులు చేశాడు. సొంత ఊరిలో ఉపాధి లేకపోవడంతో అప్పులు తీర్చేందుకు హైదరాబాద్‌కు వెళ్లి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే, పెరుగుతున్న అప్పులు, కూతురి అనారోగ్యం ఆయనను మానసిక వేదనకు గురిచేశాయి. ఈ క్రమంలోనే మనస్తాపం చెందిన ఆయన ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని మృతుని భార్య రజిత కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

## చత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపన కోసం రేండ్లగూడ నూతన కమిటీ ఎన్నిక



ప్రజాస్ఫూర్తి, జన్నారం : జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన కోసం హిందూ వాహిని, శివాజీ కమిటీ సభ్యులు దండవేణి శ్రీధర్ ఓడిపేల్లి రాజేష్ ల ఆధ్వర్యంలో ఆదివారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విగ్రహ కమిటీ అధ్యక్షునిగా మోటపలుకుల రమేష్, గౌరవ అధ్యక్షులుగా ఏనుగు సుభాష్ రెడ్డి, అల్లం నరేష్, చెటుపల్లి సత్యం, నెమలికొండ ఆశారాజ్, ప్రధాన కార్యదర్శిగా కస్తులాపురి నరేష్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ ఆసిఫ్, మాసం రవి కిరణ్, కోశాధికారిగా మెంగని మహేష్, సభాధ్యక్షులుగా అల్లం రవి, అల్లం వెంకటరాజం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మాట్లాడుతూ రేండ్లగూడ గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. యువతలో దేశభక్తి భావాలను పెంపొందించడం కోసం కృషి చేస్తామని అన్నారు.

## ప్రజా సమస్యలపై మాజీ కార్పొరేటర్ పాదయాత్ర



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : సూరారం కాలనీలో గల రాజీవ్ గృహ కల్ప సముదాయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివారం మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పాదయాత్ర చేస్తు సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతు స్థానికంగా ఉన్నా సమస్యలను చాలా వరకు పరిష్కరించామన్నారు. మిగతా సమస్యలను దశలవారీగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కార్పొరేటర్ నిధులతో పూర్తి చేయిస్తానని తెలపారు. ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు శివాగౌడ్, రాజు గౌడ్, ప్రకాష్, లత, బాలేష్ స్థానిక మహిళలు, నాయకులు ఉన్నారు.

## దక్షిణ మధ్య రైల్వేలో అగ్నిమాపక భద్రతా స్పెషల్ డ్రైవ్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నెలరోజుల పాటు నిర్వహిస్తున్న అగ్నిమాపక భద్రతా స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆదివారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. పి.ఎస్.ఆర్ కృష్ణ ఇన్స్పెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌పిఎఫ్/భద్రాచలం రోడ్ రైల్వే పార్శిల్ కార్యాలయంలో ఎస్.ఐ సాయి సబ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో అగ్నిమాపక భద్రతా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ప్రయాణికులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక యంత్రాల వినియోగ విధానాన్ని వివరించడంతో పాటు రైల్వే ప్రయాణంలో నిషేధిత వస్తువులు ఏవో తెలియజేశారు. అలాంటి వస్తువులు తీసుకెళితే ఎదురయ్యే పరిణామాలు, చట్టపరమైన చర్యల గురించి కూడా స్పష్టంగా వివరించారు. స్టేషన్లు, రైళ్లలో అగ్ని ప్రమాదాలను నియంత్రించడం, ఉద్యోగులు , ప్రయాణికుల్లో అప్రమత్తత పెంపొందించడం ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్.ఐ జి.ఎన్. స్వామి, జేమ్స్ పాల్ , కమర్షియల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వార్డుల్లో తిరగండి.. సమస్యలు తీర్చండి

* **ఏదులాపురాన్ని రాష్ట్రంలోనే 'రోల్ మోడల్'గా తీర్చిదిద్దుతాం**
* **కౌన్సిలర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దిశానిర్దేశం**



ప్రజాస్ఫూర్తి/ఖమ్మం జిల్లా : ఎన్నికల వరకే రాజకీయం.. గెలిచిన తర్వాత ఏ పార్టీ వారైనా ప్రజా ప్రభుత్వం తరపున పేదవాడికి సేవ చేయాల్సిందే.. పదవి అనేది అధికారం కాదు,బాధ్యత అని గుర్తించాలి" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పెద్దతండాలోని మున్సిపల్ కార్యాలయంలో ఏదులాపురం నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత బాధ్యతల స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి నూతన ప్రజాప్రతినిధులకు తనదైన శైలిలో దిశానిర్దేశం చేశారు. ప్రజలు నమ్మి ఓటేశారని,కేవలం కుర్చీలకే పరిమితం కాకుండా నిత్యం క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు."ప్రతి కౌన్సిలర్ వారంలో ఐదు రోజులు, ఉదయం పూట రెండు గంటలు తప్పనిసరిగా వార్డుల్లో పర్యటించాలి..ప్రతి పనికి నిధులు అవసరం లేదు, మీరు బాధ్యతగా తిరిగితేనే అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగుపడుతుంది" అని సూచించారు. ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని, తాగునీటి సమస్యలు, మురికినీరు నిలవకుండా చూడటం, నాలాల కబ్జాలను అడ్డుకోవడంపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

* **ఇందిరమ్మ ఇంటి వేడుకలో ఆత్మీయత**

సత్యనారాయణపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడి గృహ ప్రవేశ వేడుకకు మంత్రి హాజరయ్యారు.. నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపి, ఆత్మీయంగా పట్టు వస్త్రాలను కానుకగా అందించారు..పేదల సంక్షేమమే ఈ ప్రభుత్వ ధ్యేయమని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్,కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## సిద్దిపేట జిల్లాలో విషాదం – మెడికల్ విద్యార్థిని ఆత్మహత్య



సిద్దిపేట, ప్రజాస్ఫూర్తి : సిద్దిపేట జిల్లా అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలోని సురభి మెడికల్ కాలేజ్ లో విషాద ఘటన చోటుచేసుకుంది. కాలేజీలో ఫిజియోథెరపీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శ్రీజ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... మృతురాలు పెద్దపెల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం మెడిపెల్లి గ్రామానికి చెందినదని సమాచారం. హాస్టల్ గదిలో అనుమానాస్పద స్థితిలో కనిపించడంతో సహ విద్యార్థులు కాలేజీ యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యులు ఆమెను మృతిగా ప్రకటించారు. సమాచారం అందుకున్న సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, వారి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు.ఆత్మహత్యకు గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదని, చదువుల ఒత్తిడి లేదా ఇతర వ్యక్తిగత కారణాల కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనతో కాలేజీ ప్రాంగణంలో విషాద వాతావరణం నెలకొంది.

## యూనియన్ల ప్రతిపాదనలమేరకే అక్రిడిటేషన్ కమిటీలు



ఖమ్మం, ప్రజాస్ఫూర్తి : యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడేషన్ కమిటీలు ఏర్పాటు చేస్తామని, వెబ్ సైట్ సమస్యలు పరిష్కరిస్తామని టీయూడబ్ల్యూజె(ఐ జె యు) ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ కు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హామీ ఇచ్చారు.జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరిన టి యు డబ్ల్యూ జె ఐ జె యు బృందం మంత్రిని ఆదివారం ఖమ్మంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో రామనారాయణ నేతృత్వంలో కలిసి వినతిపత్రం అందజేశారు.కేబుల్ చానల్స్, చిన్న పత్రికలకు కూడా అక్రిడేషన్లు ఇవ్వాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. రామ్ నారాయణ ఈ సందర్భంగా మంత్రికి అన్ని విభాగాల జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్రంలో 44709 మంది జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇస్తామని చెప్పారని, తమరు ఇచ్చిన జీవో ప్రకారం చూస్తే 50% కార్డులు కూడా రావనే గందరగోళం జర్నలిస్టుల్లో నెలకొందని పేర్కొన్నారు. ఫ్రీలాన్సర్, వెటరన్ జర్నలిస్టులకు పెట్టిన నిబంధనలు ఇబ్బందిగా ఉన్నాయని, వెబ్ సైట్ ఓపెన్ చేస్తే అందులో అడిగే ప్రశ్నలు కార్డులు ఇచ్చేలా లేవని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. వెబ్సైట్ ఫార్మేట్ సులభతరంగా లేదని ప్రస్తావించారు. జిల్లా అక్రిడేషన్ కమిటీలలో గత సాంప్రదాయం ప్రకారం రిజిస్టర్డ్ యూనియన్ నుంచి లెటర్ పంపితే కమిషనర్ కార్యాలయం ఆమోదించి వారిని కమిటీ లో సభ్యులుగా తీసుకున్నారని, ప్రస్తుతం దానిని పక్కన పెట్టి కలెక్టర్లకు అధికారం కల్పించడాన్ని తప్పు పట్టారు. ఇది అత్యంత విచారకరమన్నారు. పాత పద్ధతినే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత జీవో ప్రకారం కలెక్టర్ అందరిని నామినేట్ చేస్తారనే ఉందని , ఇది సాధ్యం కాదని, కలెక్టర్కు కొత్త చిక్కులు తెచ్చి పెడుతుందని పేర్కొన్నారు. మా విన్నపాన్ని పరిశీలించి గతంలో అక్రిడేషన్ కమిటీలు ఏ విధంగా ఏర్పాటు చేశారో అదే సాంప్రదాయాన్ని కొనసాగించాలని రామ్ నారాయణ మంత్రిని కోరారు. జీవో ప్రకారం పెద్ద పత్రికలు, శాటిలైట్ చానల్స్, డెస్క్ జర్నలిస్టుల కార్డులు తగ్గించడం జరిగిందని, దీంతో ఇబ్బందులు తప్పవనే ఆందోళనతో జర్నలిస్టులు ఉన్నారని పేర్కొన్నారు. చిన్న పత్రికల వారు కూడా తమకు గతంలో మాదిరిగా కార్డులు రావని ఆందోళనలో ఉన్నారని, కేబుల్ చానల్స్ జర్నలిస్టులకు అన్యాయమే జరుగుతుందని వివరించారు. గతంలో వారు కార్డులు పొందినప్పటికీ, ఈసారి కార్డులు రావని ఆందోళన చెందుతున్నారని 20 నిమిషాల పాటు అన్ని అంశాలపై మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడేషన్ కమిటీలు ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. అక్రిడేషన్ వెబ్ సైట్ ను సరళీకరణ చేస్తామన్నారు. అక్రిడేషన్ల గడువు మరో నెల పొడిగింపు జరుగుతుందని, జర్నలిస్టులు, సంఘాల నాయకులు ఆందోళన చెందరాదన్నారు. అర్హులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, మాజీ జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, యూనియన్ జిల్లా కార్యదర్శి మైస పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మామిడాల భూపాల్, జర్నలిస్టుల జిల్లా హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మోయినుద్దీన్, జిల్లా కోశాధికారి నాగండ్ల శివ, ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, నంచర్ల జనార్ధన చారి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వేగినాటి మాధవరావు, జిల్లా నాయకులు ఏలూరు వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## 28 న మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

* **తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి.**
* **పల్లా దేవేందర్ రెడ్డి..**




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ఈనెల 28వ తేదీన వరంగల్ లో జరుగుతున్న ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ గార్డ్ కార్మికుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా మెడికల్ కాంటాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికులుగా పనిచేస్తున్న పర్మినెంట్ కు నోసుకోలేదని నేటికీ శ్రమదోపిడికి గురవుతున్నారని కావున ఆసుపత్రి కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత లేకున్నా అరకొర వేతనాలతో ఏజెన్సీ కాంట్రాక్టర్ల శ్రమ దోపిడీకి గురవుతున్న ప్రభుత్వ ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ కార్మికులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందించడమే కాకుండా ఆసుపత్రి స్వచ్ఛతకు చిహ్నంగా నిలుస్తున్నారని అన్నారు. ఇలాంటి సిబ్బంది జీవితాలకు భరోసాగా నిలవాల్సిన ప్రభుత్వ అధినేతలు నోటితో పొగుడుతూ నొసటితో వెక్కిరించే ద్వంద ఆర్థిక విధానాలను అవలంబిస్తున్నారని మండిపడ్డారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సమాన పనికి సమాన వేతనం అందించాలని తీర్పు ఇచ్చి దశాబ్దాలు గడుస్తున్న కోర్టు తీర్పులను కూడ అమలు చేయకపోవడం ఎంతో బాధాకరమని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ వైద్య రంగంలో ఏజెన్సీల విధానం ద్వారా కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సిబ్బంది వేతనాలు అందిస్తున్నారని దీనిద్వారా ఏజెన్సీల కాంట్రాక్టర్లు లబ్ధి పొందుతున్నారే తప్ప ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులు వారి సంక్షేమం ప్రభుత్వ ఖజానా గణాంకాల్లో లెక్కలు తప్ప క్షేత్రస్థాయిలో కాంట్రాక్టు సిబ్బంది జీవన విధానం విధ్వంసం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఏజెన్సీల విధానం రద్దుచేసి తక్షణమే కార్పొరేషన్ ద్వారా నేరుగా కార్మికులకు జీతభత్యాల అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలతో పోల్చుకుంటే హాస్పిటల్ కార్మికులకు వచ్చే వేతనాలు ఏమాత్రం సరిపోవటం లేదని టెండర్ల కాలపరిమితి ముగిసిన నేటికీ పాత టెండర్లను కొనసాగిస్తూ తక్కువ వేతనాలతో పని చేయిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే కొత్త టెండర్లు పిలిచి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల సాధనకై ఈ నెల 28న వరంగల్ జిల్లా కేంద్రంలో వేలాదిమందితో భారీ ప్రదర్శన కార్మిక సభను ఏర్పాటు చేస్తున్నామని కనుక వరంగల్ సభకు మెడికల్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సిబ్బంది పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి విశ్వనాథులు లెనిన్ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు ఏం యాదగిరి, సిహెచ్ నిర్మల, పి ఎల్లమ్మ, పద్మ, ఏ రామేశ్వరమ్మ, అన్నపు లింగస్వామి, సందీప్, మధు, సబిత, కే నిర్మల, ఉషమ్మ, యాదమ్మ, ఏ శ్రీదేవి, డి అరుణ, ఇంద్రమ్మ, యమునా, టి పద్మ, పుష్పలత, కళావతి, సుజాత, శిల్ప, బుజ్జి, సునీత, రజిత, కృష్ణమ్మ, ధనమ్మ, అండాలు, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి సర్పంచ్ లకు శిక్షణా తరగతులు

* **జన్నారం సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు కుదుర వెంకన్న**



ప్రజాస్ఫూర్తి, జన్నారం : జన్నారం మండలంలో సోమవారం నుంచి నిర్వహించ తలపెట్టిన సర్పంచ్ ల శిక్షణా తరగతులకు సర్పంచులు హాజరు కావాలని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కుదుర వెంకన్న విజ్ఞప్తి విజ్ఞప్తి చేశారు. ఆదివారం రోజున పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెజారిటీ సర్పంచ్ లు ఉన్న ఫోరం తమదేనని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్నారం మండలంలో ఉన్న 29 గ్రామపంచాయతీలకు గాను 21 మంది సర్పంచులు తమ ఫోరంలో ఉన్నారని తెలిపారు. ఒక పార్టీకి సంబంధించిన సర్పంచ్ కేవలం ఎనిమిది మందితో ఒక సర్పంచ్ ఫోరం ను ఏర్పాటు చేసుకుని పత్రికా ప్రకటనలు ఇవ్వడం సరికాదన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం నుంచి సర్పంచు లకు నిర్వహించే శిక్షణా తరగతులకు మండల సర్పంచు లు తప్పక హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పేదలకు నాణ్యమైన వైద్యం తక్కువ ఫీజులకే అందజేయాలి

* **మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



నల్లగొండ , ప్రజాస్ఫూర్తి : ప్రైవేట్ హాస్పిటల్ పేదలకు నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఫీజులకే కే అందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు ఆదివారం స్థానిక డాక్టర్స్ కాలనీలో నూతనంగా ఆధునిక హంగులతో ఏర్పాటు చేసిన లాలిత్య స్కిన్ హాస్పిటల్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎంఆర్, ఆరోగ్యశ్రీ సేవలు ద్వారా కోట్ల రూపాయల వైద్యం అందిస్తున్నామన్నారు. డెర్మటాలజిస్ట్ డాక్టర్. లాలిత్య మాట్లాడుతూ మానవ శరీరంలో చర్మం అతి ముఖ్యమైన భాగమని అన్నారు చర్మ,జుట్టు,గోళ్ల చికిత్సకు మా హాస్పిటల్ లో అధునాతన శాస్త్రీయ, సౌందర్యం కు మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. చర్మ సమస్యలు ఏవైనా ఆలస్యం చేయకుండా సరైన సమయంలో చికిత్స తీసుకోవాలని ఆమె సూచించారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశాంక్, డాక్టర్ గౌరి శ్రీ, డాక్టర్ హరినాథ్ ఉన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ప్రైవేటు వైద్య సంస్థలు కీలకపాత్ర

* **రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆర్కే హాస్పిటల్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాలు , సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆధునిక వైద్య సదుపాయాలను పరిశీలించిన మంత్రి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఇటువంటి ప్రైవేట్ వైద్య సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. స్థానిక ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య ఇతర ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఆసుపత్రి నిర్వాహకులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## శిక్షణా తరగతులను సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలి

* **సర్పంచుల ఫోరం అధ్యక్షులు పేరం శ్రీనివాస్**



ప్రజాస్ఫూర్తి జన్నారం: మంచిర్యాల జిల్లా ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో నేటి నుండి ఈ నెల 27వ తేదీ వరకు సర్పంచులకు నిర్వహించే ప్రత్యేక శిక్షణా తరగతులకు మండల సర్పంచులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని జన్నారం మండల సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పేరం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జన్నారం మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు ఈ శిక్షణ కార్యక్రమానికి ఎటువంటి జాప్యం లేకుండా సకాలంలో హాజరు కావాలని కోరారు. గ్రామ అభివృద్ధి,పంచాయతీ రాజ్ చట్టాలు,పాలనపరమైన అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈ శిక్షణను ఏర్పాటు చేసిందని,కావున సర్పంచులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రీతి కిడ్నీ సెంటర్" ప్రారంభం

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : జీడిమెట్ల డివిజన్ సుచిత్ర చౌరస్తా లో డాక్టర్ చంద్రమోహన్ వడ్డీ, డాక్టర్ రూప పుట్ట ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "ప్రీతి కిడ్నీ సెంటర్" ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధుల గుర్తింపు, చికిత్సలో ప్రముఖ ప్రఖ్యాతిగాంచిన ప్రీతి కిడ్నీ సెంటర్ 4వ బ్రాంచ్ సుచిత్రలో ప్రారంభం కావడంతో శివారు ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య నేత, కాలే నాగేష్, కుంటి మల్లేష్, నదీమ్ రాయ్, బాల మల్లేష్, కాలే గణేష్, జయం చారి, చంద్ర శేఖర్ రెడ్డి, రాజు యాదవ్, జలిగం రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## రాజీవ్ గృహకల్పలో కమ్యూనిటీ హాల్, ప్రహరీ గోడ నిర్మించాలని ఎంపీ కి వినతి





జగద్గిరిగుట్ట,(ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని ఆర్జీకె రోడ్ నెంబర్ 4 శివాలయం వద్ద ఉన్న బ్లాక్ నెంబర్ 29 ,34 వద్ద గల ఖాళీ స్థలంలో కమ్యూనిటీ హాల్ , ప్రహరీ గోడ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదివారం మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ను కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జె.కె.శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్పందించిన ఎంపీ ఈటెల రాజేందర్ తన నిధుల నుంచి రూ.4 లక్షలు మంజూరు చేశారు. రాబోయే బడ్జెట్ లో కూడా నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. తక్షణమే స్పందించి సాంక్షన్ చేసినందుకు ఎంపీ కి శేఖర్ యాదవ్ కాలనీవాసులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరంజే.కె.శేఖర్ యాదవ్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఎంపీ ఈటెల రాజేందర్ ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పున్నారెడ్డి , రాజు యాదవ్, రాజీవ్ గృహకల్ప కాలనీ వాసులు శ్రీనివాస్ చారి, పుల్లారెడ్డి, రాఘవయ్య, గోపి, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి జాతర, కళ్యాణోత్సవ



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : గాజుల రామారం డివిజన్ శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి జాతర , కళ్యాణోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి కృపా కటాక్షాలు భక్తులందరిపై ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పీఎంఏవై నిధులపై రాష్ట్రం ఆశలు

*** 3 లక్షల ఇళ్లకు రూ.2,520 కోట్లు వచ్చే అవకాశం**

*** ఆవాస్ ప్లస్ యాప్‌లో మరోసారి సర్వే పూర్తి**

హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) గ్రామీణ' నుంచి ఇచ్చే నిధులపై రాష్ట్ర ప్రభుత్వం ఆశలు పెట్టుకుంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను అధికారులు రాష్ట్ర ప్రభుత్వ యాప్‌లో ఇంతకుముందే నమోదు చేశారు. పీఎంఏవైగ్రామీణ పథకం కింద నిధులు రావాలంటే పీఎంఏవై ప్లస్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని కేంద్రం నిబంధన పెట్టింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది.. 12,810 గ్రామపంచాయతీల్లో 5,72,415 మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మరోసారి సర్వే చేసి కేంద్ర యాప్‌లో వివరాలను నమోదు చేశారు. ఈ విషయాన్ని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞాపన సమర్పించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు మూడు లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కోరింది. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామాలు, పట్టణాల్లో నిర్మిస్తున్న ఇళ్లకు రూ.17,639 కోట్లు అవసరమవుతాయని హౌసింగ్ కార్పొరేషన్ లెక్కలు వేసింది. బడ్జెట్‌లో కేటాయింపుల ద్వారా రూ.12,571 కోట్లు, పీఎంఏవైగ్రామీణం ద్వారా రూ.2,520 కోట్లు, పీఎంఏవైఅర్బన్ ద్వారా రూ.750 కోట్లు, ఇతర మార్గాల్లో మిగిలిన నిధులు సమకూర్చుకోవాలని ప్రణాళికలు రూపొందించింది.

## వైభవంగా బీరప్పకు బోనాలు

*** భక్తి శ్రద్ధలతో బోనాల ఊరేగింపు కార్యక్రమం**



అందోలు, ప్రజాస్ఫూర్తి: కురుమల కులదైవమైన బీరప్ప జాతర మహోత్సవాలు అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఐదు రోజులుగా వైభవంగా సాగుతున్నాయి. జాతర ఉత్సవాలలో భాగంగా ఆదివారం బీరప్ప బోనాల సమర్పణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. మహిళలు, పురుషులు బోనమెత్తి ఊరేగింపు చేపట్టారు. బోనాల ఊరేగింపు గ్రామంలోని ప్రధాన రహదారి గుండా ఆలయం వరకు ఊరేగింపు శోభాయమానంగా సాగింది. డప్పు చప్పుళ్లు, డోలు వాయిద్యాల నడుమ శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. బోనాల ఊరేగింపులో గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల నుండి ప్రజలు, బంధువులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బోనాల ఊరేగింపు ప్రారంభం నుండి ఆలయం వరకు సాగిన ఊరేగింపులో అడుగడుగున మహిళ భక్తులు నీళ్ల బిందెలతో చాకలు పెడుతూ స్వాగతం పలికారు. బోనాల ఊరేగింపు ప్రారంభం నుండి ఆలయం వరకు సుమారుగా రెండు గంటల పాటు ఈ బోనాల ఊరేగింపు శోభాయాత్ర సాగింది. ఆలయం వద్దకు చేరుకున్న తరువాత మహిళలు బోనాలలోని నైవేద్యాన్ని సాంప్రదాయబద్ధంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో పంటలు బాగా పండాలని, పశు సంపద వర్ధిల్లాలని కోరుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ బల్బులతో అలంకించడంతో పాటు ఆలయం ప్రాంగణం చుట్టూ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో ఆలయ పరిసర ప్రాంగణం ఆధ్యాత్మిక వాతరణాన్ని సంతరించుకుంది. బీరప్ప జాతర ఉత్సవాలలో భాగంగా 23న సోమవారం ఉదయం 11-55 గంటలకు బీరప్ప-కామరాతి కళ్యాణాన్ని నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. బీరప్ప కళ్యాణం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొననుండడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. నీటి వసతితో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై తీర్థ ప్రసాదాలు స్వీరించాలని కోరారు.



## జ్యోతిర్లింగ క్షేత్రం అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**

జిన్నారం, ప్రజాస్ఫూర్తి :జిన్నారం మున్సిపల్ కేంద్రంలో నూతనంగా నిర్మించిన జీవనజ్యోతి జ్యోతిర్లింగం దేవాలయంలో ఆదివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలలో భక్తి భావం పెంపొందించేలా నూతన ఆలయాలు నిర్మించడం హర్షించదగ్గ విషయం అన్నారు. పటాన్చెరు నియోజకవర్గ వ్యాప్తంగా సొంత నిధులతో 200లపైగా దేవాలయాలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు.జీవనజ్యోతి జ్యోతిర్లింగం దేవాలయానికి గతంలోనే 16 లక్షల రూపాయల విరాళం అందించడం జరిగిందని,భవిష్యత్తులోనూ సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. దేవాలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శివ భక్తుల విజ్ఞప్తి మేరకు ఆలయం పరిధిలో సన్నిధానం నిర్మిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు. నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుంది

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. ఆదివారం జిహెచ్ఎంసి కొంపల్లి సర్కిల్ పరిధి దూలపల్లి లో గిరీష్ గుప్తా, విష్ణు గుప్తా, హరీష్ గుప్తా ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "రాకెట్ రంబుల్" ఇండోర్ బాడ్మింటన్ కోర్ట్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న నగరీకరణలో కాలనీ వాసులకు, సమీప ప్రాంత వాసులకు శారీరక దృఢత్వం పెంపొందించుకోవడంలో ఇండోర్ బాడ్మింటన్ కోర్ట్ వంటి క్రీడా ప్రాంగణాలు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, మాజీ కౌన్సిలర్లు డప్పు కిరణ్, రవీందర్ యాదవ్, పూజారి వసంత లక్ష్మణ్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, చందు, సాయిరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అఖిలభారత పోలీస్ సౌత్‌జోన్ టీ20 టోర్నమెంట్‌లో తెలంగాణ పోలీస్ జట్టు విజయం



అమరావతి: అఖిల భారత పోలీస్ సౌత్‌జోన్ టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మూలపాడు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మైదానంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఎన్ఎస్జీ జట్టుపై తెలంగాణ పోలీస్ జట్టు 124 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. తెలంగాణ పోలీస్ జట్టులోని లోకనాథ్ నాయక్ 58 బంతుల్లో 119 పరుగులు చేసి అద్భుత శతకం సాధించారు. అత్యుత్తమ బ్యాటింగ్ ప్రతిభ కనబరచిన ఆయనకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రదానం చేశారు. ఈ మ్యాచ్‌లో తెలంగాణ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ 40 పరుగులు సాధించి ప్రత్యర్థి జట్టు ముందు భారీ లక్ష్యాన్ని ఉంచడంలో తనదైన పాత్ర పోషించారు.

# మైమరిపించే.. పియోనీ అందాలు!

**రోజా పువ్వులను తలపించే అందం, కార్నేషన్‌లను మరిపించే ఆకారం... పియోనీ పూల సొంతం. పెంచుకునే ప్రదేశానికీ, అలంకరించిన చోటుకీ వన్నె తెచ్చే ఈ మొక్క గురించి మీకు తెలుసా?**



అందం, సంపద, ప్రేమ, గౌరవాలకు చిహ్నంగా భావించే పియోనీ పూలు ఆసియాతోపాటు యూరప్, అమెరికాల్లోని పలు ప్రాంతాల్లో విరివిగా కనిపిస్తాయి. రెండు వేల ఏళ్ల క్రితం నుంచీ చైనీస్ వంటకాల్లోనూ, ఔషధాల్లోనూ వాడుతున్నారట. మనదేశంలోనూ ఇవి పెరుగుతాయి. ప్రాంతాన్ని బట్టి హిమాలయన్ పియోనీ, మమేఖ్, కశ్మీర్ మిడ్... అంటూ ఒక్కోపేరుతో పిలుస్తున్నారు. ఈ మొక్కలు ఒక్కసారి నాటితే వందేళ్ల పాటు బతికేయగలవు. కాబట్టే ఎక్కువమంది వీటిని పెంచుకోవడానికి ఆసక్తి చూపిస్తారట. నీలం మినహా తెలుపు, గులాబీ, ఎరుపు, పసుపు, ఊదా వంటి వర్ణాల్లోనూ విరబూస్తాయి. పరిమాణంలో పెద్దవిగా సువాసన కలిగి ఉంటాయి. అంతేకాదు, ఇవి రకాన్ని బట్టి తీపి, గులాబీ, సిట్రస్, మసాలా... వంటి సువాసనలూ వెదజల్లుతాయట.

**ఎలా పెంచాలంటే...**


పియోనీ దుంపల్ని నేల ఉపరితలం నుంచి 12 అంగుళాల కింద నాటుకుంటే చాలు. కుండీల్లోనూ బాగా నిలదొక్కుకుంటాయి. అయితే కాస్త పెద్ద పరిమాణంలో ఉన్నదాన్ని ఎంచుకోవాలి. నీరు నిలవని సారవంతమైన మట్టిని ఎంచుకోవాలి. సూర్యకాంతి నేరుగా తగిలేలా చూసుకోవాలి. అంటే కనీసం 6-8 గంటల పాటు ప్రత్యక్షంగా తగలాలి. నీళ్లను క్రమం తప్పకుండా పోయాలి. కానీ, అవి నిలిచిపోకుండా చూసుకోవాలి. ఒకటికంటే ఎక్కువ మొక్కలు నాటినప్పుడు వాటి మధ్య 2-3 అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలి. ఎందుకంటే, ఇవి కాస్త పెద్దగా పెరుగుతాయి. పియోనీ మొక్కలకు నైట్రోజన్ అధికంగా ఉన్న ఎరువులు వేయకూడదు. ఆకులు ఎక్కువగా, పూలు తక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. బదులుగా ఎన్‌పీకే 5:10:10 సమగ్ర ఎరువు లేదా బోన్‌మీల్‌ని నెలకోసారి ఇవ్వాలి. సంవత్సరానికి ఒకసారి మొక్క చుట్టూ ఉన్న మట్టిని తవ్వి కంపోస్ట్ వేయాలి. ఈ మొక్కలకు పురుగులు వచ్చే అవకాశం తక్కువ. అప్పుడప్పుడూ చీమలు చుట్టుముడతాయి. బూడిద రంగు పురుగులు, తెగులు కనిపిస్తాయి. ఇలాంటప్పుడు వ్యాధి సోకిన కొమ్మల్ని తొలగించి ఆకుల్ని శుభ్రపరిస్తే చాలు. ఫంగిసైడ్, వేపనూనె వంటివి ఉపయోగించొచ్చు.












# యాదగిరిగుట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు: మురళీకృష్ణుడిగా దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహుడు!

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన ఆదివారం, స్వామివారు భక్తులకు మురళీకృష్ణుడి (శ్రీకృష్ణుడు) అవతారంలో దర్శనమిచ్చారు.

*** మురళీకృష్ణుడి అలంకారంలో ఊరేగింపు**

ఉదయం నుంచే ఆలయంలో వేద మంత్రోచ్చారణలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మురళీకృష్ణుడి అవతారంలో అలంకరించి, ఆలయ తిరుమాఢవీధుల్లో వైభవంగా ఊరేగించారు. చేతిలో వేణువు పట్టుకుని, గోపికా మనోహరుడిగా దర్శనమిచ్చిన నారసింహుడిని చూసి భక్తులు



పులకించిపోయారు. అనంతరం వేంచేపు మండపంపై స్వామివారిని వేంచేపు చేసి, అర్చకులు వేదమంత్రాలు పఠించారు. స్వామివారి ఈ దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

**సాయంత్రం పొన్న వాహన సేవ**

బ్రహ్మోత్సవాల క్రమంలో ఐదో రోజు సాయంత్రం స్వామివారికి పొన్న వాహన సేవ నిర్వహించారు. ఈ సేవలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తూ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భవాని శంకర్, అనువంశిక ధర్మకర్త బీ.నరసింహ మూర్తి, ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, బట్టర్ సురేంద్రాచార్యులు, ఇతర ఆలయ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**నిత్యం ఒక అవతారంలో..**

బ్రహ్మోత్సవాల వేళ స్వామివారు ప్రతిరోజూ ఒక విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ వార్షిక వేడుకలు యాదగిరిగుట్ట కొండపై ఆధ్యాత్మిక శోభను



సంతరింపజేశాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌కు..
## ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు

కామారెడ్డి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు అరెస్టు అప్రజాస్వామికం అని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ హౌస్ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడిగా సొంత పార్టీ ఎమ్మెల్యేకు సంఘీభావం తెలపడం కూడా నేరమేనా..? నాడు కేసీఆర్ ఇదే తరహా హౌస్ అరెస్టులు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశాడు.. నేడు రేవంత్ రెడ్డి అదే పాటిస్తున్నాడు.. ఆయనకు పట్టిన గతే మీకు పడుతుంది అని ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ నేతలతో గుండాయిజం చేస్తున్నారు. ప్రజాస్వామ్యం కాపాడాల్సిన ప్రభుత్వమే దాడులను ప్రోత్సహిస్తుంది.. సంఘీభావం తెలపడానికి వెళ్తున్నా బీజేపీ ఎమ్మెల్సీలను, ఎమ్మెల్యేలను, ఎంపీలను, నాయకులను హౌస్ అరెస్ట్ చేస్తున్నారు. ఈ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి. మీకు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయం అని ఈటల రాజేందర్ హెచ్చరించారు.



# మార్చిలోనే రాష్ట్ర బడ్జెట్ : సీఎం రేవంత్ రెడ్డి

- * దేవాదులపై ఇంజినీర్లతో సీఎం సమీక్ష
- * మార్చిలో కేబినెట్‌లో అంచనాలను ఆమోదిస్తాం..
- * బడ్జెట్‌లోపే భూసేకరణకు నిధులిస్తాం..

ఈ నెల 28నే రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని వస్తున్న వార్తలకు తెరపడింది. మార్చి మొదటి లేదా రెండో వారంలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి దేవాదుల ప్రాజెక్టు సందర్శన సందర్భంగా ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు మార్చిలో ఉంటాయని సీఎం రేవంత్ చెప్పకనే చెప్పారు. సమీక్ష సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. జూన్ 2 లోపల భూసేకరణ కోసం రూ. 600 కోట్లు మంజూరు చేస్తాం. బడ్జెట్‌లోపే అన్ని అంచనాలను ప్రభుత్వం ముందుంచి ఆమోదం తీసుకోవాలి. మార్చిలో మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి అన్ని అంచనాలకు ఆమోదం



తెలియజేస్తామని సీఎం అన్నారు. నెల రోజుల్లోపే దేవాదుల పంప్ రిపేర్ చేయాలి. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, అధికారులతో దేవాదులపైన కమిటీ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాను. అన్ని ప్రాజెక్టుల భూ సేకరణ కోసం ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తాం. గ్రీన్ ఛానల్‌లో నిధులు మంజూరు చేస్తాం. భూ సేకరణ జాప్యం వల్ల ప్రాజెక్టుల పనులు ఆగడానికి వీలు లేదు. రామప్ప చెరువు నుంచి జంపన్న వాగుకు నీరు అందించే ప్రణాళికపైన నివేదిక ఇవ్వాలి అని ఇంజినీరింగ్ అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# ఐసెట్ అభ్యర్థులకు టీశాట్ డిజిటల్ పాఠాలు..
## రేపటి నుండే ప్రసారాలు ప్రారంభం




పలు పోటీ పరీక్షలకు డిజిటల్ లెసన్స్ అందిస్తోన్న టీశాట్ (T SAT) నెట్వర్క్ తెలంగాణ ఐసెట్ 2026 పరీక్షలకు సైతం డిజిటల్ లెసన్స్ అందిస్తోందని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ఎంబిఏ, ఎంసిఏ అర్హత పరీక్ష ఐసెట్ కోసం ఫిబ్రవరి 23వ తేదీ సోమవారం నుండి ప్రసారాలు మొదలవుతాయన్నారు. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్2026 మే 13,14 వ తేదీన జరగనుండగా ఎనలిటిక్ ఎబిలిటీ, మ్యాథమెటిక్స్, కమ్యూనికేషన్ ఎబిలిటీ తదితర సబ్జెక్టులపై రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున ప్రసారం చేయనున్నామని, విద్యా ఛానల్ లో ఉదయం ఐదు నుండి ఆరు గంటల వరకు, నిపుణ ఛానల్ లో సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు డిజిటల్ లెసన్స్ ప్రసారమవుతాయి సీఈవో వివరించారు. తెలంగాణాలోని విద్యార్థులు టీశాట్ డిజిటల్ లెసన్స్ సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

# నన్ను కోసినా డబ్బుల్లేవన్నాడు..
## ఇప్పుడేమో కాంగ్రెస్‌కు రూ. 1000 కోట్లు పంపిస్తాడట..

**: సీఎంపై బండి ఫైర్**

పూటకో మాట మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ నిప్పులు చెరిగారు. నన్ను కోసినా డబ్బులు లేవన్నోడు.. ఇప్పుడేమో ఏఐసీసీకి రూ. 1000 కోట్లు ఇచ్చే శక్తి తెలంగాణకు ఉందని సీఎం గర్వంగా చెబుతున్నాడు అని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను గాంధీ కుటుంబా



నికి ఏటీఎంగా మార్చేసిందని.. బీజేపీ నిరంతరం చెబుతూనే ఉంది అని గుర్తు చేశారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, పెన్షనర్లకు, ఆరు గ్యారెంటీల అమలుకు డబ్బు లేదు కానీ.. ఢిల్లీ పిలిచినప్పుడు డబ్బు ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నాడని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రజా పాలన కాదు.. ఇది గాంధీ కుటుంబ పాలన అని బండి సంజయ్ విమర్శించారు. అయితే సీఎం వ్యాఖ్యలను ఎక్స్ వేదికగా ఎండగట్టిన బండి సంజయ్.. గతంలో ఉద్యోగ సంఘాలపై నిప్పులు చెరుగుతూ.. నన్ను కోసినా డబ్బుల్లేవు అని రేవంత్ వ్యాఖ్యానించిన వీడియోతో పాటు నిన్న డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణా శిబిరంలో సీఎం మాట్లాడుతూ.. రాహుల్ గాంధీకి రూ. 1000 కోట్లు ఇచ్చే శక్తి తెలంగాణకు ఉందని వ్యాఖ్యానించిన వీడియోలను ఎక్స్ వేదికగా ఎంపీ షేర్ చేశారు.

# రేవంత్ వేసే ప్రతి అడుగు వెనక భూముల కబ్జాలు..
## రియల్ ఎస్టేట్ వ్యాపారమే: హరీశ్ రావు

సీఎం రేవంత్ వేసే ప్రతి అడుగు వెనక భూముల కబ్జాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఉంటాయని బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్ రావు మండిపడ్డారు. రేవంత్ సర్కార్ చేసేది మూసీ సుందరీకరణ కాదని, రియల్ ఎస్టేట్ దోపిడీ అని ధ్వజమెత్తారు. పేదల ఇండ్లు కూల్చి మెగా కృష్ణారెడ్డికి భూములు కట్టబెట్టే కుట్ర అని ఆరోపించారు. పేదలకు డబ్బుల్లేవనే సీఎంకి వందల కోట్లతో క్యాంపు ఆఫీసుల కట్టుకునేందుకు పైసలెక్కడివని ప్రశ్నించారు. కేసీఆర్ మంచినీళ్లు ఇచ్చి బతుకులను నిలబెడితే, రేవంత్ రెడ్డి బుల్డోజర్లు పెట్టి వారి జీవితాలను కూలగొడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్‌కు ఇచ్చిన నోటీసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుల పక్షాన వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా ఇండ్లు కోల్పోతున్న మధు పార్క్ అపార్ట్‌మెంట్ బాధిత కుటుంబాలను పార్టీ నేతలతో కలిసి హరీష్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ ఆదేశాలతో తాము ఇక్కడికి వచ్చామన్నారు. 'కేసీఆర్‌కు మధు పార్క్ అపార్ట్‌మెంట్‌తో మర్చిపోలేని అనుబంధం ఉంది. ఆయన ఈ అపార్ట్‌మెంట్‌కు మూడుసార్లు వచ్చారు. టీఆర్ఎస్ పార్టీ పాలసీ విజన్ డాక్యుమెంట్‌ను ఇక్కడి వార్ రూముల్లో కూర్చునే తయారు చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక.. ఇక్కడ మంచినీళ్లు లేక మీరు అపార్ట్‌మెంట్ ఖాళీ చేసి వెళ్లిపోతామంటే, అప్పటికప్పుడు హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించి ప్రత్యేక పైపులైన్ వేశారు. అప్పటి హోంమంత్రి నాయిని నరసింహారెడ్డితో బటన్ ఆన్ చేయించి మరీ మీకు నీళ్లు ఇచ్చారు. సబితక్కకు ఒక్క ఫోన్ చేస్తే రాత్రికి రాత్రే మీ ముందు రోడ్డు వేయించారు. నాడు మూసీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న సుధీర్ రెడ్డి మూసీని క్లీన్ చేయించి మీకు దోమల బెడద లేకుండా చేశారు. కేసీఆర్ ఎప్పుడూ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ఎలా పెంచాలి, ప్రజలకు ఎలా మేలు చేయాలని ఆలోచించారు. కేసీఆర్ ఈ అపార్ట్‌మెంట్‌ను నిలబెట్టే ప్రయత్నం చేస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం జేసీబీలతో దీన్ని కూల్చాలని చూస్తున్నాడు.

*** మూసీ ప్రక్షాళనపై పూటకో తీరు..**

కాంగ్రెస్ ప్రభుత్వానికి మూసీ ప్రక్షాళనపై




కనీస పాలసీ, ఒక విధానం లేదు. పూటకో తీరుగా వ్యవహరిస్తున్నారు. మూసీని శుద్ధి చేయాలని అందరూ కోరుకుంటారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా అప్పట్లోనే రూ.3800 కోట్లతో ఎస్టీపీలను నిర్మించి ఆ పని ప్రారంభించింది. కాళేశ్వరం నుంచి గోదావరి నీళ్లు తెచ్చి మూసీలోకి వదిలేందుకు డీపీఆర్‌లను కూడా కేసీఆర్ ప్రభుత్వం తయారు చేయించింది. అప్పుడు మా ప్రభుత్వానికి ఏ ఒక్క ఇల్లూ కూల్చే ఆలోచన రాలేదు. అసలు రేవంత్ రెడ్డి ఏం చేసినా దాని వెనుక కచ్చితంగా రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఉంటుంది.

**రియల్ ఎస్టేట్ దోపిడీ..**

ముఖ్యమంత్రిగా ఆయన వేసే ప్రతి అడుగులో భూముల పంచాయితీలు, రియల్ ఎస్టేట్ దోపిడీ దాగి ఉంటుంది. సెంట్రల్ యూనివర్సిటీ భూములు గుంజుకుందామని ప్రయత్నం చేస్తే సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసింది. ఎల్టీపీఎస్ భూములను కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని ఆలోచన చేశాడు. ఫార్మాసిటీ కోసం కేసీఆర్ 14,000 ఎకరాలు సేకరిస్తే.. దాన్ని ఫోర్త్ సిటీ అని పేరు మార్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇప్పుడు మూసీ సుందరీకరణ పేరిట మీ ఇండ్లు కూల్చి, మీ భూములు లాక్కొని.. వాటిని అంబానీకో, అదానీకో, మెగా కృష్ణారెడ్డికో కట్టబెట్టాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడు. మీ జేబులు నింపుకోవడానికి చేసే ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మేం పూర్తిగా వ్యతిరేకం.




# భూ నిర్వాసితులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్

ములుగు జిల్లాలోని జే.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం లో భాగంగా భూసేకరణ కోసం జూన్ 2వ తేదీలోపు 600 కోట్లు రూపాయలు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలలోపు అన్ని అంచనాలను ప్రభుత్వం ముందుంచి ఆమోదం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దేవాదుల పంప్ హౌస్‌ను పరిశీలించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. నెల రోజుల్లోపు దేవాదుల పంప్ మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చిలో మంత్రివర్గ సమావేశంలో అన్ని అంచనాలకు ఆమోదం తెలియజేస్తామని చెప్పారు. శాసనసభ సమావేశాల సమయంలో దేవాదుల ఎత్తిపోతల పథకంపై ప్రజాప్రతినిధులు, అధికారులతో కమిటీ హాలులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణలోని అన్ని ప్రాజెక్టుల భూసేకరణ కోసం ప్రత్యేక కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. భూములు కోల్పోయిన వారికి పరిహారం గ్రీన్ ఛానెల్‌లో నిధులు మంజూరు చేస్తామని, భూ సేకరణ జాప్యం వల్ల ప్రాజెక్టుల పనులు ఆగడానికి వీలు లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.


# సాక్షాత్తు రేవంత్ రెడ్డే ఒప్పేసుకున్నాడు: కేటీఆర్

తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలంతా తలో చెయ్యి వేసి ఒక వెయ్యి కోట్లు పోగు చేసి రాహుల్ గాంధీ కుటుంబానికి ఇచ్చే సామర్థ్యం ఉందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్(KTR) స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా కీలక ట్వీట్ పెట్టారు. రెండేళ్లుగా తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఏటీఎం లాగా మారింది అని మేమెన్నోసార్లు చెప్పిన విషయం ఇప్పుడు సాక్షాత్తూ రేవంత్ రెడ్డే నిస్సిగ్గుగా ఒప్పుకున్నాడు. రైతన్నలకు, మహిళలకు, యువతకు, అవ్వాతాతలకు ఉద్యోగస్తులకు, రిటైర్డ్ ఉద్యోగస్తులకు ఇచ్చిన 420 హామీల అమలుకేమో రూపాయి లేదంటాడు. మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇండ్లను, లగచర్లలో గిరిజనుల భూమిని, హెచ్‌సీయూ విశ్వవిద్యాలయ భూమిని, హిల్ట్ పాలసీ పేరిట పరిశ్రమల భూమిని, అనుముల బ్రదర్స్ కలిసి ఆంబుక్క పడుతున్నారు. రెండేళ్లలోనే మూడు లక్షల కోట్ల అప్పు తెచ్చి రాష్ట్రంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదీ సర్కారు. చేస్తున్నదల్లా దండుపాళ్యం ముఠాలాగా తెలంగాణను దోచుకోవడం, స్వంతానికి దాచుకోవడం. పదవిని కాపాడుకోవడం కోసం ఢిల్లీకి సంచులు మోయడం' అని కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.



# పార్టీ బలోపేతమే లక్ష్యం
## డీసీసీ అధ్యక్షులకు మహేష్ కుమార్ గౌడ్ దిశానిర్దేశం

డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన నాయకులు జిల్లాల్లో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజలతో సన్నిహితంగా మమేకమవ్వాలని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. సమన్వయం, క్రమశిక్షణ, సేవా భావంతో పని చేస్తే కాంగ్రెస్ పార్టీకి మరింత ప్రజాదరణ లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. వికారాబాద్ అనంతగిరిలో ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం రెండో రోజు కార్యక్రమంలో మహేష్ కుమార్ గౌడ్,



తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం పాల్గొన్నారు. సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమం భాగంగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక శిక్షణా శిబిరం ద్వారా పార్టీ సంస్థాగత బలోపేతానికి, నాయకత్వ సామర్థ్యాల అభివృద్ధికి దిశానిర్దేశం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రాల వారీగా డీసీసీ అధ్యక్షులకు సమగ్ర అవగాహన కల్పిస్తూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై స్పందన విధానాలు, పార్టీ విధానాల అమలు, బూత్ స్థాయి బలోపేతం వంటి అంశాలపై విస్తృత చర్చలు నిర్వహిస్తున్నారు. పది రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యల పరిష్కార విధానాలు, ఎన్నికల వ్యూహ రచన, సోషల్ మీడియా మరియు మీడియా నిర్వహణ, కార్యాచరణ ప్రణాళికలు వంటి కీలక అంశాలపై నిపుణుల ద్వారా డీసీసీ చీఫ్‌లకు శిక్షణ అందించనున్నారు.

# ఏఐ సమిట్‌లోనూ కాంగ్రెస్ మురికి రాజకీయాలు: ప్రధాని మోదీ

మేరఠ్: ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమిట్‌లో శుక్రవారం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్నంగా నిరసన చేపట్టడాన్ని ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. గ్లోబల్ ఈవెంట్ ఏఐ సమిట్‌ను కాంగ్రెస్ తన మురికి రాజకీయాలకు వేదికగా మార్చుకుందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. యూపీలోని మేరఠ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఏఐ సమిట్‌లో విదేశీ అతిథులు కూర్చున్న వేదిక వద్దకు కాంగ్రెస్ నాయకులు అర్ధనగ్నంగా వచ్చి గందరగోళం సృష్టించారని తెలిపారు. తమ చర్యలతో కాంగ్రెస్ నేతలు ఇప్పటికే ప్రజల దృష్టిలో దిగజారారని.. ఇంకా ఇటువంటి పనులు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దేశాన్ని అప్రతిష్ఠపాలు చేసే పనిలో కాంగ్రెస్ తీరిక లేకుండా ఉందని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా జాతీయ ప్రయోజనాల కోసం చేపడుతున్న కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఈవిధంగా ప్రవర్తించడం సిగ్గుచేటని ప్రధాని విమర్శించారు. రాజకీయ విభేదాల కంటే వారు వ్యక్తిగత శత్రుత్వంపైనే దృష్టి పెడుతున్నారన్నారు. గతంలో తనను, తన తల్లిని అవమానించారని..ఇప్పుడు ప్రపంచ నేతల ఎదుట దేశాన్ని అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంటే.. కాంగ్రెస్ నేతలు మాత్రం దేశపరువు తీయడానికి చూస్తున్నారని దుయ్యబట్టారు.






**అసలేం జరిగింది..?**

ఏఐ ఇంపాక్ట్ సమిట్‌ను లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్ యువజన విభాగమైన 'భారత యువజన కాంగ్రెస్ (ఐవైసీ)' కార్యకర్తలు నాటకీయ రీతిలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఎగ్జిబిషన్ హాలు నంబరు 5లోకి ప్రవేశించిన దాదాపు 15 మంది కార్యకర్తలు.. చొక్కాలు విప్పి ఆందోళన చేపట్టారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రానికి, భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నినాదాలు రాసి ఉన్న టీషర్ట్‌లు వారి చేతుల్లో కనిపించాయి. వారి చర్యల వల్ల కొంత సమయం పాటు సమావేశానికి అంతరాయం కలిగింది. అనంతరం భద్రతా సిబ్బంది వారిని కస్టడీలోకి తీసుకున్నారు.

## ఒకే రోజు అక్కాచెల్లెళ్ల పెళ్లి.. గంటల ముందే ఇద్దరి ఆత్మహత్య..!



రాజస్థాన్ జోధ్‌పుర్‌లోని ఓ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. ఒకే రోజు పెళ్లి కావాల్సిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు బలవన్మరణానికి పాల్పడటం కలకలం రేపింది. వివాహ ముహూర్తానికి కొన్ని గంటల ముందే వీరిద్దరూ ఆత్మహత్య చేసుకోవడం ఆ కుటుంబంలో తీవ్ర వేదన మిగిల్చింది. జోధ్‌పుర్‌లోని మనై గ్రామానికి చెందిన శోభ (25), విమల (23)ల వివాహం ఒకే రోజు జరిపించేందుకు నిర్ణయించిన కుటుంబ సభ్యులు.. ఫిబ్రవరి 21న ముహూర్తం నిశ్చయించారు. పెళ్లి కోసం ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ముందు రోజు చేసే కార్యక్రమాలు పూర్తయ్యాక ఇద్దరు పెళ్లి కుమార్తెలు నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో వారిద్దరి ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. మృతదేహాలను ఇంటికి తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. ఈమేరకు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పురుగు మందు తాగడం వల్ల ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాథమికంగా నిర్ధరించిన పోలీసులు.. పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం తెలియరాలేదు.

## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు ఉగ్రవాదుల హతం




జమ్మూకశ్మీర్‌లోని కిష్త్‌వాడ్‌లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులు హతమయ్యారు. వారికి జైషే మహమ్మద్‌తో సంబంధం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ముగ్గురి మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయని చెప్పారు. భద్రతా ఏజెన్సీల ప్రాథమిక అంచనాల ప్రకారం మృతుల్లో ఒకరిని జైషే మహమ్మద్ కమాండర్ సైఫుల్లాగా భావిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే నిఘావర్గాల సమాచారం ఆధారంగా భద్రతాబలగాలు కిష్త్‌వాడ్‌లో ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలోనే చత్రూ బెల్ట్‌లోని పాసెర్‌కుట్ ప్రాంతంలోని ఓ గుడిసెలో ఉగ్రవాదుల ఆచూకీని గుర్తించాయి. దీంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ముగ్గురు ఉగ్రవాదులను భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. గుడిసెలో మంటలు చెలరేగడంతో మృతదేహాలు కాలిపోయాయి. ఘటనాస్థలం నుంచి రెండు ఏకే 47 రైఫిల్స్, ఇతర పేలుడు పదార్థాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. కరడుగట్టిన ఉగ్రవాది సైఫుల్లా దాదాపు ఐదేళ్ల క్రితం జమ్మూకశ్మీర్‌లోకి చొరబడినట్లు సమాచారం. అప్పటినుంచి స్థానికంగా యాక్టివ్‌గా ఉన్నాడు. 2024 జులైలో నలుగురు సైనికుల మృతికి కారణమైన దాడి సహా అనేక ఘటనలకు సూత్రధారి అనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో అనేక ఎన్‌కౌంటర్‌ల నుంచి తప్పించుకున్నాడు. తాజా ఎన్‌కౌంటర్‌తో కలిపి ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఏడుగురు జైషే మహమ్మద్ ఉగ్రవాదులు హతమయ్యారు.

## కాంగ్రెస్ నేత శామ్‌పిట్రోడా మళ్లీ నోరు విప్పాడు..



కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ ఛైర్మన్ శామ్‌పిట్రోడా చేసిన వ్యాఖ్యలు మరోసారి వివాదస్పదమవుతున్నాయి. ఇతర దేశాలకు సేవ చేసేందుకే భారత నైపుణ్యాలు దోహదపడుతున్నాయని విమర్శలు చేయడం ఇందుకు కారణమైంది. సుమారు 150 కోట్ల జనాభా ఉన్న భారత్‌కు సొంతంగా ఆపరేటింగ్ సిస్టమ్ లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఓ ఇంటర్వ్యూలో పిట్రోడా చేసిన ఈ వ్యాఖ్యలపై భాజపా తీవ్ర స్థాయిలో మండిపడింది. "భారత యువతలో ఎంతో ప్రతిభ ఉంది. వారి నైపుణ్యాలను వినియోగించడంలో భారత్ విఫలమైంది. మన యువతను ఇతర దేశాలు విరివిగా వాడుకుంటున్నాయి. ప్రోగ్రామింగ్, బ్యాంకింగ్, న్యాయశాస్త్రం, పరిశ్రమలు.. ఇలా ఎన్నో రంగాల ఆవిష్కరణల్లో మన యువతే ప్రధాన పాత్ర వహిస్తోంది. సుమారు 150 కోట్ల జనాభా ఉన్న భారత్‌లో మైక్రోసాఫ్ట్‌లాంటి కంపెనీ లేదు. మన ప్రతిభతో కనీసం ఫోన్‌కు సంబంధించిన ఆపరేటింగ్ సిస్టమ్‌ను తయారు చేయలేకపోయాం" అని పిట్రోడా వ్యాఖ్యనించారు. పిట్రోడా వ్యాఖ్యలపై భాజపా స్పందించింది. ఆయన అబద్ధాలతో భారత్‌ను ఎగతాళి చేస్తున్నారని ఆ పార్టీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. లినక్స్, మాయ ఓఎస్, ప్రైమ్‌ఓఎస్, భారోఓఎస్, ఇండస్ ఓఎస్ నెక్స్ క్వాంటమ్ కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్‌లను భారత్ అభివృద్ధి చేసిందని గుర్తుచేశారు.



## ఆ లక్ష వాహనాలకు రూ.5.6 కోట్ల 'టోల్ రిఫండ్'

ముంబయిపుణె హైవేలో ఇటీవల ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడడంతో వేలాది వాహనాలు ఒక రోజుకు పైగా ట్రాఫిక్‌లో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై చర్యలు చేపట్టిన మహారాష్ట్ర ప్రభుత్వం.. ఆ సమయంలో వసూలు చేసిన టోల్‌ను రిఫండ్ చేసేందుకు సిద్ధమైంది. దాదాపు లక్షకు పైగా వాహనదారులకు టోల్ ఫీజును తిరిగి చెల్లించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎక్స్‌ప్రెస్ వేపై అదోషీ టన్నెల్ సమీపంలో ఫిబ్రవరి 3న ఓ ట్యాంకర్ బోల్తా పడి గ్యాస్ లీక్ కావడంతో పెద్దఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. దాదాపు లక్షకుపైగా వాహనాలు 33 గంటలపాటు రోడ్లపైనే నిలిచిపోయాయి. దీంతో నీరు, ఆహారం, ఇతర వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెంటనే చర్యలు చేపట్టిన అధికారులు టోల్ వసూలు నిలిపివేశారు. అప్పటికే ఫాస్టాగ్ ద్వారా వసూలు చేసిన రుసుములను వాహనదారులకు తిరిగి ఇవ్వాలని నిర్ణయించారు. లక్షకు పైగా వాహనాలకు రూ.5.16 కోట్లు మేర వాహనదారుల ఖాతాల్లోకి రిఫండ్ చేస్తామని మహారాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ అధికారులు పేర్కొన్నారు.

## మన టెక్నాలజీ చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయాయి

**: ప్రధాని మోదీ**

భారత ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఏఐ సమిట్ ప్రపంచ దేశాలను ఆకర్షించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఏఐ సమిట్‌లో ముఖ్యంగా రెండు భారత ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయని పేర్కొన్నారు. జంతువుల చికిత్సకు.. వాటిని ట్రాక్ చేయడానికి ఏఐను వినియోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ఏఐను ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని ప్రధాని అన్నారు. ఆదివారం 131వ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. కృత్రిమ మేధస్సు, అంతరిక్ష పరిశోధన, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని అన్నారు. మన యువత తమ ఆవిష్కరణలతో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లే శక్తిని కలిగి ఉందని ప్రశంసించారు. ఈ సదస్సు ద్వారా వివిధ దేశాల నేతలకు, టెక్ దిగ్గజాలకు మన యువత ప్రతిభను, నూతన ఆవిష్కరణలను స్వయంగా చూపించే అవకాశం లభించిందన్నారు. ప్రపంచ స్థాయి నాణ్యతను దృష్టిలో పెట్టుకొని వస్తువుల ఉత్పత్తి, సేవలు ఉండాలని దేశంలోని తయారీదారులు, స్టార్టప్‌లకు సూచించారు. అలాగే సైబర్ నేరాలపై ప్రధాని మోదీ హెచ్చరించారు. డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.


**ఆ చిన్నారి నలుగురికి జీవనదాత**

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్‌ను ప్రధాని గుర్తు చేసుకున్నారు. బ్రెయిన్ డెడ్ అయిన తమ చిన్నారి అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన ఆమె తల్లిదండ్రులను ప్రశంసించారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. దీనివల్ల ఆ చిన్నారి నలుగురికి జీవనదాతగా మారిందన్నారు. ఇటువంటి ఘటనల వల్ల దేశంలో అవయవ దానంపై అవగాహన



పెరుగుతోందన్నారు.

## మెట్రో పిల్లర్‌పై చిక్కుకుపోయిన 'సుభాష్'.. రక్షించిన అగ్నిమాపక బృందం..




కొచ్చి: దాదాపు రెండు వారాలుగా మెట్రో పిల్లర్‌పై చిక్కుకుపోయిన పిల్లిని అగ్నిమాపక బృందాలు తీవ్రంగా శ్రమించి కిందకు దించిన ఘటన కేరళలోని కొచ్చిలో చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొచ్చిలోని జవహర్ లాల్ నెహ్రూ మెట్రో స్టేషన్ పిల్లర్‌పై రెండు వారాలుగా ఓ పిల్లి చిక్కుకుపోయింది. పిల్లర్‌లపై పిల్లి బిక్కుబిక్కుమంటూ తిరుగుతుండడాన్ని గమనించిన స్థానికులు జంతు సంరక్షణ బృందానికి సమాచారం ఇచ్చారు. శనివారం ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు మెట్రో సర్వీసులు ముగిసిన తర్వాత రాత్రిపూట విద్యుత్ లైన్‌ను ఆపివేసి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. అయితే పిల్లి ఎక్కడ ఉందనే విషయం గుర్తించలేకపోయారు. ఆదివారం తెల్లవారుజామున ఓ మెట్రో పిల్లర్‌పై పిల్లి ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో రంగంలోకి దిగిన అగ్నిమాపక బృందాలు హైడ్రాలిక్ లిఫ్ట్ ఉపయోగించి.. ఆ పిల్లర్‌పై ఉన్న పిల్లిని వలతో పట్టుకోవడానికి ప్రయత్నించాయి. కాగా పిల్లి వలలోకి రాకుండా తప్పించుకోవడంతో కొన్ని గంటలపాటు శ్రమించి దానిని సురక్షితంగా కిందకు దించారు. 'మంజుమ్మల్ బాయ్స్' సినిమాలో లోయలో జారిపడిపోయిన 'సుభాష్' పేరును స్థానిక ఆటో డ్రైవర్లు ఆ పిల్లికి పెట్టడంతో అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## మహిళకు పార్శిల్.. అందులో పుర్రె, ఎముకలు



చెన్నై (ప్యారిస్): పార్శిల్‌లో మనిషి పుర్రె, ఎముకలు వచ్చిన ఘటన చెన్నైలోని ప్యారిస్‌లో కలకలం రేపింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్యారిస్‌లోని ఓ దుకాణంలో వ్యాసర్పాడికి చెందిన శ్రుతి అనే మహిళ పని చేస్తున్నారు. ఆ దుకాణం సెక్యూరిటీ వద్దకు ఓ వ్యక్తి వచ్చి.. శ్రుతికి ఈ పార్శిల్ వచ్చిందని ఇచ్చి వెళ్లాడు. అనంతరం ఆమెకు సెక్యూరిటీ ఆ కవర్‌ను తీసుకెళ్లి ఇవ్వగా.. అది తనది కాదని.. తీసుకునేందుకు నిరాకరించింది. దీంతో దుకాణ యజమాని అందరి సమక్షంలోనే పార్శిల్ తెరిచి చూశాడు. అందులో మనిషి పుర్రె, ఎముకలు, విభూది ఉండడం చూసి.. అందరూ దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శ్రుతి కుటుంబీకులకు, అదే షాపులో పని చేసే దినేశ్ కుటుంబీకులకు గొడవలు ఉన్నాయని, ఈ నేపథ్యంలోనే ఆమెను భయపెట్టేందుకు అతను అలా చేసినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. దినేశ్, అతని అనుచరులు శ్రీనివాసన్, జోసెఫ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.



## వధువుని కిడ్నాప్ చేసిన మాజీ ప్రేమికుడు

వివాహం జరిగిన రోజే నవ దంపతులకు ఓ షాకింగ్ ఘటన ఎదురైంది. పెళ్లి తంతు పూర్తయిన అనంతరం వధూవరులు ఇంటికి వెళ్తుండగా.. వధువును మాజీ ప్రేమికుడు కిడ్నాప్ చేయడం కలకలం రేపింది. ఈ ఘటన ఒడిశాలోని బోలంగిర్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హరిబందు పటేల్‌కు కంటామల్‌కు చెందిన యువతితో ఆదివారం ఉదయం వివాహం జరిగింది. పెళ్లి కార్యక్రమం అనంతరం వారు వరుడి ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో వారి వాహనాన్ని వధువు మాజీ ప్రేమికుడు అడ్డుకున్నాడు. తన అనుచరులతో కలిసి పెళ్లి కుమారుడి కుటుంబసభ్యులను బెదిరించారు. అంతేకాకుండా పెళ్లికొడుకిని తుపాకీతో బెదిరించి వధువును బలవంతంగా తీసుకెళ్లాడు. హరిబందు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కిడ్నాపైన పెళ్లికుమార్తె ఆచూకీకి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

## శరద్ పవార్‌కు అస్వస్థత.. ఆసుపత్రికి తరలింపు



నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ అస్వస్థతకు గురయ్యారు. ఆయనను పుణెలోని రుబీ హాల్ ఆసుపత్రికి తరలించినట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. తీవ్రమైన దగ్గు, గొంతు ఇన్‌ఫెక్షన్‌తో ఇటీవల ఆసుపత్రిలో చేరిన శరద్ పవార్‌ను వారం క్రితం తిరిగి ఇంటికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణించడంతో మళ్లీ ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలుస్తోంది. ఆయన డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. శరద్ పవార్ ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలియాల్సి ఉంది. కొన్ని రోజులుగా పవార్ అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని ఆయన కుమార్తె, ఎంపీ సుప్రియా సూలే తెలిపారు.

# ప్రొద్దుటూరులో భారీ చోరీ.. 35 తులాల బంగారం అపహరణ



ప్రొద్దుటూరు (నేరవార్తలు): వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో భారీ చోరీ జరిగింది. పట్టణంలోని తిమ్మయ్య కాలనీలో తాళం వేసిన ఇంట్లో 35 తులాల బంగారం, 40 తులాల వెండిని దొంగలు అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మయ్య కాలనీకి చెందిన బాలిరెడ్డి కుటుంబం శనివారం పెనికలపాడులోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు.. పగలు రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం తలుపులు తెరిచి ఉండటాన్ని స్థానికులు గమనించి



ఇంటి యజమానికి సమాచారం అందించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని పరిశీలించగా.. బీరువాలో భద్రపరిచిన బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. ఇతర వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. దీంతో పోలీసులకు వారు సమాచారం అందించారు. సీఐ కొండారెడ్డి, ఎస్సై సంజీవరెడ్డి తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇంట్లోని వేలిముద్రలతో పాటు పలు ఆధారాలను క్లూస్‌టీమ్ సేకరించింది. ఈ చోరీ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## జగన్.. ఇప్పటికైనా తప్పులు ఒప్పుకొని క్షమాపణ కోరండి

**: మంత్రి మండిపల్లి**





చిత్తూరు: చిత్తూరు పర్యటనలో ఏపీ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేవుడితోనే వైకాపా నీచ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. దేవుడిపై భక్తి, హిందువుల మనోభావాలపై జగన్‌కు గౌరవం లేదని ఆక్షేపించారు. "చెప్పులు వేసుకొని వేంకటేశ్వరస్వామి ఫొటోలతో నిరసన తెలిపారు. తితిదే సంప్రదాయాలు, హిందూ విశ్వాసాలపై జగన్‌కు చిన్న చూపు. పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన ఘనత వైకాపాదే. పరకామణి కేసులో నిందితుడితో జగన్ రాజీపడ్డారు. తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు, సేవా టికెట్లు అమ్ముకున్నారు. శ్రీవారి తలనీలాల అక్రమ రవాణాకు పాల్పడిన ఘనత వైకాపా నేతలది. వైకాపా హయాంలో 300కుపైగా దేవాలయాలపై దాడులు జరిగాయి. శ్రీవారిని అవమానించిన వ్యక్తిని తితిదే ఛైర్మన్‌గా నియమించారు. దర్శనాలు, వసతి, ప్రసాదాల ధర పెంచి భక్తులపై భారం మోపారు. దేవుడితో ఆటలు ఆడినందుకే వైకాపా 11 సీట్లకు పరిమితమైంది. జగన్.. ఇప్పటికైనా చేసిన తప్పులు ఒప్పుకొని దేవుడికి క్షమాపణ కోరాలి"అని మండిపల్లి డిమాండ్ చేశారు.



## రాజమహేంద్రవరంలో పలువురికి అస్వస్థత.. పాల వల్లేనని అనుమానాలు!

రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం నగరంలోని లాలాచెరువు ప్రాంతంలో పలువురు ఒకేసారి అనారోగ్యం బారిన పడటం కలకలం రేపుతోంది. స్థానిక చౌడేశ్వర నగర్, స్వరూప్‌నగర్‌లలో బాధితులు అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. వారిలో కొందరికి కిడ్నీలు పాడైనట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతంలో రోజూ ఓ వ్యక్తి వచ్చి పాలు పోసేవాడని, ఆ పాలు తాగిన వారంతా ఇలా అనారోగ్యం బారిన పడినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న వైద్యశాఖ అధికారులు కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలతో అనారోగ్యానికి కారణాలు, వివరాలు సేకరిస్తున్నారు. కోరుకొండ మండలానికి చెందిన పాలు పోసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

## భూమనా నీకిది తగునా.. మిమ్మల్ని శ్రీవారు వదిలిపెట్టరు: శాప్ ఛైర్మన్ రవినాయుడు



విజయవాడ: తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని వేంకటేశ్వర స్వామి వదిలిపెట్టబోరని శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. భూమన తన స్వార్థ రాజకీయాల కోసం స్వామివారిని పణంగా పెడుతున్నారని మండిపడ్డారు. స్వామి వారితో పెట్టుకుంటే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. 365 రోజులూ స్వామి వారిపైనే ప్రెస్‌మీట్లు పెట్టడం భూమనకు తగునా?అని ప్రశ్నించారు. స్వామివారిని అడ్డం పెట్టుకొని రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు. గుడిని, హుండీని, ప్రసాదాలను, చివరికి స్వామివారికి సమర్పించిన తలనీలాలను కూడా దోచేశారని దుయ్యబట్టారు.

## హిందువుల మనోభావాలంటే వైకాపా వారికి లెక్కేలేదు: పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం: వైకాపా అధ్యక్షుడు జగన్, ఆ పార్టీ నేతలకు దేవుడంటే భయం, భక్తి లేవని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. హిందువుల మనోభావాలంటే వారికి లెక్కేలేదన్నారు. విశాఖలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవదేవుడిని కూడా రాజకీయాలకు వాడుకునే స్థాయికి దిగజారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "జగన్ మార్గదర్శకత్వంలో శ్రీవారి ఫొటోలతో రాజకీయం చేసే నీచానికి దిగజారారు. దేవుడి ప్రసాదాన్ని జంతు కొవ్వు, ప్రమాదకర రసాయనాలతో కల్తీ చేశారు. శ్రీవారి పరకామణి కేసు నిందితుడు రవికుమార్‌తో రాజీ చేసుకున్నారు. తితిదే నిధులను దారిమళ్లించారు.



తిరుపతి నగరపాలక సంస్థ పేరిట రూ.కోట్లు దోచేశారు'' అని పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు.

## అమరావతిలో R-5 జోన్ రద్దు.. 900 ఎకరాల భూమి తిరిగి సీఆర్‌డీఏ పరం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధిలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన R5 జోన్‌ను రద్దు చేస్తూ ఏపీ సీఆర్‌డీఏ అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జోన్ పరిధిలో ఉన్న సుమారు 900 ఎకరాల భూమిని తిరిగి సీఆర్‌డీఏకు అప్పగించాలని అధికారులు ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ భూముల్లో వేసిన లేఅవుట్లు, ఇళ్ల స్థలాల పంపిణీని కూడా సీఆర్‌డీఏ అధికారికంగా రద్దు చేసింది. R5 జోన్ వల్ల అమరావతి మాస్టర్ ప్లాన్‌కు తీవ్ర ఆటంకం కలుగుతుందని, రాజధాని అభివృద్ధికి ఇది అవరోధంగా మారుతుందని భావించిన యంత్రాంగం ఈ మేరకు చర్యలు చేపట్టింది. రాజధాని మాస్టర్ ప్లాన్ నిబంధనల ప్రకారం భూ వినియోగాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, గత ప్రభుత్వ హయాంలో R5 జోన్ కింద ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఈ జోన్‌లో స్థలాలు కేటాయించిన వారికి రాజధాని వెలుపల ఇతర



అనువైన ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. ఈ నిర్ణయంతో అమరావతి రాజధాని ప్రాజెక్టు తన పాత రూపానికి చేరుకోనుండగా, ఇటు రాజధాని రైతులు అప్పట్లో ఈ జోన్‌కు వ్యతిరేకంగా చేసిన పోరాటానికి ఫలితం లభించినట్లయింది.

## 'ప్రసాద్' పథకం పరిధిలోకి కాణిపాకం ఆలయం

**: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

*** పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ..**

కేంద్ర ప్రభుత్వం పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధి లక్ష్యంగా ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రసాద్' పథకం పరిధిలోకి ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం ఆలయాన్ని చేర్చేందుకు తనవంతు కృషి చేస్తానని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌తో కలిసి కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న కేంద్ర మంత్రికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్, కార్యనిర్వహణాధికారి (ఈవో),



వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు మంత్రికి స్వామివారి వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

దర్శనానంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సంపూర్ణ సహకారంతో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఉద్ఘాటించారు. రాష్ట్రం ఇప్పుడు ప్రపంచ స్థాయి పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా మారిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న కూటమి ప్రభుత్వంపై ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని తాను మనసారా కోరుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

## కోనసీమలో ఘోర ప్రమాదం.. నడిరోడ్డుపై కాలిబూడిదైన కారు

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆదివారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. ఆలమూరు మండలం మడికి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే మంటలు కారు మొత్తానికి వ్యాపించి వాహనం పూర్తిగా అగ్నిగోళంలా మారిపోయింది. తృటిలో తప్పిన ప్రాణాపాయం.. మడికి వద్ద కారు వెళ్తుండగా ఇంజిన్ నుంచి పొగలు రావడం గమనించిన డ్రైవర్, వెంటనే అప్రమత్తమై వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశారు. కారులోని ప్రయాణికులు తక్షణమే కిందకు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నిమిషాల వ్యవధిలోనే మంటలు వాహనం అంతటా వ్యాపించాయి. అయితే, నడిరోడ్డుపై కారు భారీ మంటలతో కాలిపోతుండటం, టైర్లు పేలుతున్న శబ్దాలకు స్థానికులు, వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాద తీవ్రతను చూసి భయంతో అటు ఇటు పరుగులు తీశారు. రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక



సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే కారు పూర్తిగా కాలిబూడిదైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

## రైస్ పుల్లింగ్ మోసం.. వైసీపీ నేత అరెస్ట్

రైస్ పుల్లింగ్ మోసం కేసులో వైసీపీ నేత కృష్ణారెడ్డి అరెస్టయ్యారు. మహిమగల రాగి చెంబు అని చెప్పి వేణుగోపాల్ రెడ్డి అనే వ్యక్తికి టోకరా వేశారు. రూ.2 కోట్ల విలువైన రాగి చెంబును తక్కువకే ఇస్తున్నానని చెప్పి రూ.10 లక్షలు వసూలు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం తలుపుల మండలం వైసీపీ కన్వీనర్ చింతగుంట కృష్ణారెడ్డి అలియాస్ డీకే బాబు అలియాస్ డిక్కీ బాబు మోసం చేశారు. రాగి చెంబు మహిమగలది కాదని గుర్తించిన వేణుగోపాల్ తన




డబ్బు తనకు ఇవ్వాలని అడగ్గా రివర్స్ లో బెదిరించారంటూ పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఘటన వెలుగుచూసింది. దీంతో అతన్ని అరెస్ట్ చేసి విలువైన కార్లు, లక్షరూపాయల నగదు, ఐదు రాగిచెంబులు స్వాధీనం చేసుకున్నారు. ఏదైనా వస్తువులో అద్భుతమైన శక్తులున్నాయని నమ్మించి అందినకాడికి డబ్బుల్ని దండుకోవడమే రైస్ పుల్లింగ్ మోసం అంటారు. ముఖ్యంగా రాగిచెంబులు, గిన్నెలు, నాణేలను చూపించి వాటికి అమితమైన శక్తి ఉందని నమ్మబలుకుతారు.

## ఈ జిల్లాల్లో దంచికొడుతున్న భారీ వర్షం...

వాతావరణ శాఖ అలర్ట్ ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అల్పపీడన ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఆదివారం మధ్యాహ్నం తర్వాత వర్షాలు కురుస్తున్నాయి. ఏపీలోని అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అటు తెలంగాణలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోనూ భారీ వర్షం కురిసింది. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఆకాశం మేఘావృతమై చెదురుమదురు వానలు పడుతున్నట్లు సమాచారం అందుతోంది. అల్పపీడన ద్రోణి కారణంగా రాబోయే 24 గంటల్లో మరిన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా కోస్తాంధ్ర, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ అకాల వర్షాల వల్ల కోతకు సిద్ధంగా ఉన్న పంటలు దెబ్బతినే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





# కల్తీ పాలు.. గుర్తించడం ఇలా

ఇప్పుడు పాలు కొనుగోలు చేయాలంటేనే భయమేస్తోంది. ఏది కల్తీయో.. ఏవి అసలైన పాలో తెలియడం కష్టంగా మారింది. పాలు తరచుగా నీరు, డిటర్జెంట్, యూరియా, ఫార్మాలిన్ వంటి హానికరమైన పదార్థాలతో మిశ్రమితు కల్తీ జరుగుతుంది. ఇలా కల్తీ చేసిన పాలు తగడం మూలంగా ఆరోగ్యం క్షీణిస్తుంది. ఎఫ్ఎస్ఎస్ఏఐ ద్వారా అందించబడిన కొన్ని సులభమైన పరీక్షలు ఇంటి నుంచే చేసుకోవచ్చు. ఈ పరీక్షలు చేయడం ద్వారా పాలను శుద్ధి ఎంతగా ఉందో నిర్ధారించుకోవచ్చు. అయితే మనం వాటి గురించి తెలుసుకుందాం.

**డిటర్జెంట్ పరీక్ష**: 5 మి.లీ పాల్ని ఒక పారదర్శక గ్లాసులో తీసుకుని, సమానంగా నీటిని కలపండి. బాగా కలపండి. శుద్ధమైన పాలు ఎటువంటి ఫోమ్ లేకుండా ఉండాలి లేదా కాస్త ఫోమ్ ఏర్పడుతుంది, డిటర్జెంట్ తో మిశ్రమితమైన పాలు స్థిరమైన ఫోమ్ కలిగించును.

**యూరియా పరీక్ష**: 5 మి.లీ పాల్ని ఒక పరీక్షా ట్యూబ్ లో తీసుకోండి. అంతకు సమానంగా సోయాబీన్ లేదా అహర్ పౌడర్ కలపండి. బాగా కలపండి మరియు 5 నిమిషాలు వేచి ఉండండి. ఇది లిటమస్ కాగితం కలపండి. రెడ్ లిటమస్ పేపర్ ఎరుపు రంగులో ఉంటే, పాలు శుద్ధమైనది; నీలం రంగులో మారితే, పాలు యూరియా తో మిశ్రమితమై ఉన్నది.

**ఫార్మాలిన్ పరీక్ష**: 10 మి.లీ పాల్ని ఒక పరీక్షా ట్యూబ్ లో తీసుకోండి, ట్యూబ్ యొక్క పక్కలకు 23 చుక్కలు ఘన సల్ఫ్యూరిక్ ఆమ్లం కలపండి. పాల యొక్క రంగు మారదు అంటే పాలు శుద్ధమైనది; ఎరుపు లేదా నీలం వలయాలు ఏర్పడితే, పాలు ఫార్మాలిన్ తో మిశ్రమితమై ఉన్నది.

సింథటిక్ పాల పరీక్ష: 5 మి.లీ పాల్ని మరియు 5 మి.లీ నీటిని ఒక పరీక్షా ట్యూబ్ లో కలపండి. బాగా కలపండి. ఇది స్థిరమైన ఫోమ్ రూపొందించకపోతే, పాలు శుద్ధమైనది; మరియు స్థిరమైన ఫోమ్ ఏర్పడితే, ఇది సింథటిక్ డిటర్జెంట్ తో మిశ్రమితమై ఉంది.

**నీరు పరీక్ష**: ఈ పరీక్ష కోసం, పాల యొక్క ఒక చుక్కను ఒక మృదువుగా మరియు అడ్డంగా ఉన్న ముడి మీద ఉంచండి. చుక్క అక్కడ నిలబడితే లేదా నెమ్మదిగా పులకించుకుంటే, పాలు శుద్ధమైనది. మరియు అది త్వరగా పాడయితే, నీరు కలిసిన పాలు. ఈ పరీక్షలను చేస్తూ, వినియోగదారులు తినే పాల యొక్క శుద్ధతను నిర్ధారించుకోవచ్చు.

## పాల పోషక విలువలు

పాలు సుమారు 150 కేలోరీస్, 8 గ్రా ప్రోటీన్, 8 గ్రా కొవ్వు, 12 గ్రా కార్బోహైడ్రేట్లు, 300 మి.గ్రా కెల్సియం, 2.5 మి.గ్రా విటమిన్ డీ, 1.2 మైక్రోగ్రా విటమిన్ బీ12, 0.4 మి.గ్రా రిబోఫ్లవిన్ బీ2, మరియు సుమారు 400 మి.గ్రా పొటాషియం కలిగి ఉంటుంది.

పాల కల్తీ ఇలా జరుగుతుంది..

పాల కల్తీ అనేది పాలు నాణ్యతను తగ్గించడం లేదా ఇతర రసాయనలు కలిపి కల్తీ చేస్తుంటారు. పాలకు బదులైనవి లేదా ఇతర దిగువ నాణ్యత గల పదార్థాలను కలిపి ఉంచడం జరుగుతుంది. పాలను సాధారణంగా నీరు, డిటర్జెంట్లు, ఆహార మైదా, యూరియా, సింథటిక్ పాల, ఫార్మాలిన్, రంగు పదార్థాలు మరియు చక్కెరతో మిశ్రమం చేస్తారు. ఇలాంటి పాలను పరీక్షలు చేయకుండా కల్తీ పాలుగా గుర్తించడం కష్టంగా ఉంటుంది.

**పాలు మిశ్రమితంగా ఉండటానికి కారణాలు**

విశేషజ్ఞుల ప్రకారం, ఇది అమ్మకదారుల లాభాలు పెంచేందుకు సహాయపడుతుంది, ఎందుకంటే అసలైన పాల పరిమాణం తక్కువగా మారుతుంది. ఇది పాలను పోషక విలువలో తీవ్రంగా తగ్గించడంతో పాటు శరీరంలో అనేక మార్పులకు దారితీస్తుంది.

కల్తీ పాలతో ఆరోగ్య సమస్యలు

ఆరోగ్య నిపుణుల ప్రకారం పాలలో చేర్చిన హానికరమైన పదార్థాల కారణంగా వివిధ ఆరోగ్య ప్రమాదాలు ఉంటాయి. ఇది కడుపు నొప్పి,వికారం వంటి సమస్యలను కలిగించవచ్చు. అలాగే, యూరియా, ఫార్మాలిన్ వంటి మిశ్రమిత పదార్థాలు మూత్రపిండాలను ఒత్తిడికి గురి చేయస్తాయి. కన్ని సార్లు దీర్ఘకాలిక హాని లేదా మూత్ర పిండాలు పని చేయని సమస్యలను కలిగించవచ్చు. కొందరిలో ఈ మిశ్రమాల కారణంగా చర్మ సమస్యలు, కద్దు, శ్వాస సంబంధిత సమస్యలు వస్తుంటాయి. ఫార్మాలిన్ దీర్ఘకాలికంగా ఉపయోగిస్తే కాలేయానికి గంభీరమైన ఆరోగ్య సమస్యలు, మరణం వంటి సమస్యలకు దారితీస్తుంది. కొన్ని మిశ్రమాలు శరీరంలో హార్మోనల్ సమతుల్యతను ప్రభావితం చేయవచ్చు, వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. మరియు చివరగా, మిశ్రమిత పాలను దీర్ఘకాలికంగా తీసుకోవడం మూత్రపిండ వ్యాధి క్యాన్సర్ వంటి దారుణ పరిస్థితుల ప్రమాదాన్ని పెంచవచ్చు.

**ఇంటిలో పాల శుద్ధిని ఎలా తనిఖీ చేయాలి?**

భోజన భద్రత మరియు ప్రమాణాల అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకారం, ఇంటిలో పాల శుద్ధిని తనిఖీ చేసేందుకు కొన్ని సులభమైన పద్ధతులు ఉన్నాయి. కొన్ని సులభమైన పద్ధతులను పరిశీలించండి:

ఆహార మైదా పరీక్ష: 23 మి.లీ పాల్ని ఉడికించి, చల్లబడనిచ్చండి. పాలలో 23 చుక్కలు ఐడైన్ ద్రావణం కలపండి. పాలు శుద్ధంగా ఉంటే, రంగు మార్చదు లేదా కాస్త పసుపు రంగులో మారుతుంది, అయితే నీలం రంగులో మారితే, ఇది ఆహార మైదాతో మిశ్రమం చేయబడింది.









# చిటికెలో చికెన్ కర్రీని ఇలా చేయండి

**త్వరత్వరగా ఏదైనా వండుకోవాలని ఉందా? కమ్మగా కోడికూరను 10 నిమిషాల్లోనే సిద్ధం చేసుకోవచ్చు. ఈజీ చికెన్ కర్రీ రెసిపీని ఇక్కడ చూడండి.**

మీకు ఇప్పటికిప్పడే కోడికూర తినాలని ఉందా? కేవలం 10-15 నిమిషాల్లోనే కోడికూరను సిద్ధం చేసుకోవచ్చు. మీ వద్ద సమయం లేనపుడు, వెంటనే చేసుకోవడానికి ఈ చికెన్ కర్రీ రెసిపీ మీకు ఉపయోగపడుతుంది. మీరు చికెన్ స్థానంలో రొయ్యలను కూడా చేర్చుకోవచ్చు. రొయ్యలకైతే కేవలం 10 నిమిషాల కంటే తక్కువ సమయం చాలు. మీరు ఏది చేసుకోవాలనుకున్నా, ప్రాసెస్ ఇదే. ఆలస్యం ఎందుకు, రెసిపీ చదివి మీరూ ప్రయత్నించండి మరి.

| కావలసినవి |
|---|
| 200 గ్రా బోన్‌లెస్ చికెన్ |
| 2-3 టొమాటోలు |
| 1 ఉల్లిపాయ |
| 2 టీస్పూన్ల అల్లం వెల్లుల్లి పేస్ట్ |
| 2 స్పూన్ల కారం |
| 1/4 స్పూన్ పసుపు |
| 1 స్పూన్ గరం మసాలా |
| 1 టేబుల్ స్పూన్ పొద్దుతిరుగుడు నూనె |
| 3 టేబుల్ స్పూన్లు పెరుగు |
| కొన్ని కొత్తిమీర ఆకులు |
| రుచికి తగినంత ఉప్పు |

**చికెన్ కూర తయారీ విధానం**

ముందుగా చికెన్ ముక్కలను శుభ్రంగా కడిగి పక్కనపెట్టుకోండి, టొమాటోలు, ఉల్లిపాయలు కడిగి ముక్కలుగా కోసి పెట్టుకోండి. ఇప్పుడు బాణలిలో నూనె వేసి, వేడయ్యాక ఉల్లిపాయలు వేసి రంగు మారేంత వరకు వేయించాలి. ఆపైన అల్లం వెల్లులి పేస్ట్ వేసి వేయించాలి. ఇప్పుడు టొమాటో ముక్కలు వేసి పసుపు, ఉప్పు, కారం వేసి మెత్తగా వేయించాలి, ఆపైన పావు వంతు నీళ్లు పోసి 2 నిమిషాలు ఉడికించాలి.

అనంతరం చికెన్ ముక్కలు వేసి, పైనుంచి గరం మసాలా వేసి మూతపెట్టి చికెన్ ఉడికేంత వరకు 1015 నిమిషాలు ఉడికించాలి. చివరగా పెరుగు వేసి కలపాలి, కొత్తిమీర చల్లుకోవాలి.అంతే, చికెన్ కర్రీ రెడీ. అన్నంతో కలిపి లంచ్ లేదా డిన్నర్ లో తింటూ రుచిని ఆస్వాదించండి.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.